# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :26 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేదీ: గురువారం 14-03-2024 | పేజీలు:4 వెల: 2.00


## పెరుగుతున్న ఎండల తీవ్రత

కామారెడ్డి,మార్చి13: రోజు రోజుకు ఎండలు ముదిరి పోతున్నాయి. ప్రచంఢ భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. గత వారం రోజులనుంచి జిల్లాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. మార్చి నెలలోనే ఎండలు ఇంత తీవ్రంగా ఉంటే మే నెలలో ఇంకెలా ఉంటాయో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక తప్పని సరి పరిస్థితుల్లో బయటికి వచ్చిన వారు మాత్రం ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందదానికి ప్రయత్నిస్తున్నారు. గతవారం రోజుల నుంచి వేడి గాలులు విపరీతంగా వీస్తున్నాయి. నానాటికి పెరుగు తున్న ఎండలతో జిల్లాలోని ప్రజలు విలవిలలాడుతున్నారు. పనులు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ప్రభావం చూపిస్తున్న ఎండ సాయంత్రం 6 గంటలు దాటినా వేడి తీవ్రత తగ్గక పోవడటంతో జనం బెంబేలెత్తి పోతున్నారు. గొడుగులు, హెల్మెట్లు పెట్టుకున్నా వేడినుంచి తప్పించుకోలేక పోతున్నారు. ఇక భవన నిర్మాణరంగ కూలీలతో పాటు పలు పనులు చేసే కార్మికులు ఎండ ప్రభావంతో సాయంత్రం వరకు డీలా పడి పోతున్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి తాగునీరందిస్తాం : పొన్నం



హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి తాగునీరందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్‌లో తాగునీటి కోసం రూ.5 కోట్లు కేటాయించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందించాలనేది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. 90 రోజుల్లోనే ఇచ్చిన హామీలను నెరవేర్తున్న ప్రభుత్వం తమది అని పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులను అడిగి వారి సమస్యలను పొన్నం అడిగి తెలుసుకోవడం జరిగింది. తమకు కాంపౌండ్ వాల్ తో పాటు, త్రాగునీరు, వీధి దీపాలు సమస్యలను ఉన్నాయని మంత్రి దృష్టికి విద్యార్థులు తీసుకొచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పక్కనే ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భవనం పూర్తయినప్పటికీ కాలేజీ ఎందుకు అందులోకి షిఫ్ట్ చేయలేదని అడిగారు. రేపే కాలేజీని డిగ్రీ కాలేజీ నూతన భవనం లోకి షిఫ్ట్ చేయాలని అధికారులకు, ప్రిన్సిపల్ కి ఆదేశాలు జారీ చేశారు. నూతన భవనంలో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అనివేటి మండపం శంఖుస్థాపన చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆలయ ప్రాంగణంలో అనివేటి మండపం శంఖుస్థాపన శిలన్యాస భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 16 కార్పొరేషన్ల ఏర్పాటు చరిత్రాత్మక నిర్ణయం

మెదక్ : 16 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. 16 కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షిస్తూ చిట్కుల్ లోని తన క్యాంపు కార్యాలయంలో రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ ఇందిరమ్మ స్ఫూర్తితో రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారన్నారు. 16 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా ఆయా కులాల వారందరికీ చేయూత దొరుకుతుందన్నారు. కుల మత భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం దక్కాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 16 కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ తీసుకున్న నిర్ణయన్ని తెలంగాణ సమాజం స్వాగతిస్తుందన్నారు. ముదిరాజ్ కులస్తుల చిరకాల స్వప్నమైన ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సమయంలో ఏఐసీసీ ఇంచార్జి దీపా దాస్ మున్షీ తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చలని విన్నవించడం జరిగిందన్నారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించిన వారిద్దరూ స్పష్టమైన హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే 16 కార్పొరేషన్ ల ఏర్పాటులో ముదిరాజ్ కులానికి సైతం కార్పొరేషన్ ఏర్పాటు చేశారని స్పష్టం చేశారు.



ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటుతో ముదిరాజ్ కులస్తులకు సామాజికంగా ఆర్థికంగా న్యాయం జరుగుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో అందరి సహకారంతో కార్పొరేషన్ ను మరింత బలోపేతం చేసుకుని ముదిరాజ్ యువతకు చేయూతని అందించే విధంగా కృషి చేస్తామని వెల్లడించారు. త్వరలోనే ముదిరాజ్ కులస్తులందరూ కోరుకుంటున్న విధంగా బీసీ "డీ" నుంచి బీసీ "ఏ" లోకి మార్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటుతో ముదిరాజులంతా కాంగ్రెస్ పక్షాన నిలబడాలని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో 17 స్థానాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ సామాజిక వర్గ పక్షాన కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి వర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదయ్య,రాములు, వెంకటేశ్,మురళి, కృష్ణ,ప్రభు,గోపాల్, అశోక్,శ్రీను,వెంకటేశ్, రాజ్ కుమార్, అంతయ్యా,కార్యకర్తలు,ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీని లేపి జనసేనను తగ్గించారా...!?

అమరావతి,అపర చాణక్యుడు చంద్రబాబు రాజకీయం తీరే వేరుగా ఉంటుంది. ఆయన మనసులో ఏముందో అదే జరుగుతుంది. పైకి మాత్రం అందరి మాటలు విన్నట్లుగా ఉంటారు. అందరి అభిప్రాయం తీసుకుని అంతా చేసినట్లుగా కనిపిస్తుంది. చివరికి మాత్రం చంద్రబాబు మనసులో ఎలా అనుకున్నారో అచ్చం అలాగే జరుగుతుంది. అదే బాబు స్టైల్. ఇక జనసేన మొదటి నుంచి అవుట్ రేట్ గా టీడీపీకి మద్దతు ఇస్తోంది. చంద్రబాబుకు తన భుజం కాశారు పవన్ కళ్యాణ్. బాబు అరెస్ట్ అయి జైలు గోడల మధ్య ఉంటే కొండంత ధైర్యం ఇచ్చారు పవన్. అపుడే ముందూ వెనకా ఆలోచించకుండా పొత్తుల ప్రకటన చేశారు. అయితే రాజకీయాల్లో బెట్టు బేరాలు వీర లెవెల్ లో ఉంటాయని బీజేపీని చూసిన తరువాత అయినా పవన్ కి అర్థం అయి ఉండాలి. కానీ అప్పటికే పుణ్య కాలం గడచిపోయింది. బీజేపీకి ఏపీలో అర శాతం ఓట్లు మాత్రమే ఉన్నాయి. కానీ ఎంతో పట్టు బట్టి తనకు కావాల్సిన సీట్లను సాధించుకున్న తీరు పవన్ లాంటి వారికి ఒక పాఠం కావాలి అని అంటున్నారు. సరే పవన్ విషయం ఒకటి ఉంది. ఆయనకు జగన్ గద్దె దిగాలి. తనకు ఎన్ని సీట్లు ఇచ్చారు అన్నది ముఖ్యం కాదు. ఈ గుట్టు ఆయన ఎక్కడా దాచుకోలేదు. బయటకే చెప్పేశారు. అందుకే దాన్ని ఎంచక్కా అమలు చేస్తూ తనకు కావాల్సిన రాజకీయం బాబు చేసుకుంటూ పోతున్నారు. బీజేపీ బెట్టుకు పవన్ గుట్టుని జాగ్రత్తగా ముడి పెడుతున్నారు. అలా పవన్ ని సీట్లలోనే కాదు అన్ని విధాలుగా తగ్గించి చూపిస్తున్నారు. అదే టైం లో జాతీయ పార్టీగా బీజేపీని అమాంతం పెంచేస్తున్నారు. ఇపుడు కనుక చూసుకుంటే బీజేపీ పొత్తుల ద్వారా బాగానే ఉంది. ఇటు టీడీపీ బాగా ఉంది. మధ్యలో చెడిపోయింది జనసేన అని అంతా అంటున్నారు. కానీ పవన్ కి ఇవేమీ పట్టవు కదా అన్నది నెటిజన్ల మాట. ఇదిలా ఉంటే ముందు వచ్చిన చెవుల కంటే వెనక వచ్చిన కొమ్ముల వాడి అన్న ముతక సామెత అచ్చంగా బీజేపీ విషయంలో సరిపోతుంది. అలా బీజేపీ లేట్ గా వచ్చినా లేటెస్ట్ గా పాలిటిక్స్ నడిపింది. తనకు నచ్చిన సీట్లు ఎంచక్కా తీసుకుని పోయింది. అది కూడా టీడీపీ సీట్లలో కోత పడలేదు. జనసేన సీట్లు తగ్గించి బీజేపీకి ఇప్పించి రెండు పార్టీలతోనూ పొత్తు కుదుర్చుకున్న ఘనాపాటి చంద్రబాబు అని అంటున్నారు. అందుకే చంద్రబాబు ఏది అనుకుంటే అదే జరుగుతుంది అని అంటారు. పొలిటికల్ మార్కెటింగ్ లో ఆయన దిట్ట అని చెబుతారు. టీడీపీ సీట్లు తగ్గించుకోకుండా జనసేన చేత తగ్గించడమే బాబు మార్క్ పాలిటిక్స్ అని అంటున్నారు. ఇక పవన్ కళ్యాణ్ ఎందుకు ఇలా చేస్తున్నారు అని జనసేన నేతలతో పాటు బలమైన సామాజిక వర్గంలో చర్చ సాగుతోంది. బాహుబలి అవుతాడు అనుకున్న పవన్ ఇలా బేలగా తన సీట్లను కూడా బీజేపీకి ఇచ్చేస్తూ పొత్తు ధర్మం అనుకుంటున్నారా అని కూడా కామెంట్స్ వస్తున్నాయి.



అసలు పవన్ తెలిసే ఇది చేస్తున్నారా లేక చంద్రబాబు మాయాజాలంతో ఇలా చేయిస్తున్నారా అన్న చర్చ సాగుతోంది. అయితే పవన్ కి కావాల్సింది తాను గెలవడం అని అంటున్నారు. పవన్ ఎంపీగా ఎమ్మెల్యేగా పోటీ చేస్తారు అని అంటున్నారు. ఎంపీగా చేస్తే ఏకంగా ఏడు అసెంబ్లీ సీట్లలో కనీసంగా నాలుగింటిలో అయినా జనసేనకు మెజారిటీ రావాలి. మరి అలా జరగాలంటే అది పూర్తిగా టీడీపీ చేతులలోనే ఉంది. అలాగే పవన్ ఎమ్మెల్యేగా ఎక్కడ నుంచి పోటీ చేసినా ఎక్కువగా ఆయన టీడీపీనే నమ్ముకుంటున్నట్లుగా పరిస్థితి ఉంది అని అంటున్నారు. తాడేపల్లిగూడెం సభలో ఆయన మాటలు వింటే సొంత పార్టీ నేతల మీద పెద్దగా నమ్మకం ఉన్నట్లుగా కనిపించలేదు. ఈ కారణాలతోనే ఆయన తన గెలుపు ఈసారి చాలా ముఖ్యం అని భావిస్తున్నారు అని అంటున్నారు. అందుకే తనకు ఇచ్చిన ఎన్ని సీట్లు అయినా పోతే పోనీయ్ తాను గెలిస్తే చాలు కదా అన్న లెక్కలతో ఉన్నారని అంటున్నారు. పవన్ తన కోసం పార్టీని తాకట్టు పెడుతున్నారు అని కూడా నెట్టింట చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. ఇక పవన్ కళ్యాణ్ ఎన్ని చేసినా ఏమి చేసినా కాపు పెద్దలు ఎవరూ అడిగే సీన్ లేదు. దానికి కారణం నాకు ఎవరూ సలహాలు ఇవ్వవద్దు అని పదే పదే పవన్ చెప్పేశారు. పవన్ కళ్యాణ్ దెబ్బకు ముద్రగడ పద్మనాభం అన్ కండిషనల్ గా వైసీపీలోకి వెళ్తున్నారు. ఇక చేగొండి హరి రామజోగయ్య కుమారుడు వైసీపీలో చేరిపోయారు. వారు ఇపుడు ఫుల్ సైలెంట్ గా ఉంటారు. అడిగినా వారి మాటలకు వాల్యూ లేదు అనే అంటారు. సో ఇపుడు పవన్ ఫుల్ ఫ్రీడం తో ఉన్నారు. నా పార్టీ నా ఇష్టం అన్నట్లుగా అయన తనకు ఎన్ని సీట్లు ఇస్తేనేంటి అన్నట్లుగా టీడీపీతో కలసి పొత్తు రాజకీయాలు నెరపుతున్నారు అని కామెంట్స్ పడుతున్నాయి. మొత్తానికి పవన్ పొత్తు రాజకీయం అంతా ఆయన ఎంపీవో ఎమ్మెల్యే అయితే చాలు అన్నట్లుగా ఉంది అని సెటైర్లు పడుతున్నాయి.

## ఫిర్ ఏక్ బార్ మోదీ కా సర్కార్...ఈటల రాజేందర్




ఎల్బీనగర్, మార్చి 13 : కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మన భారత దేశ సర్వతోముఖాభి వృద్ధి కి శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్.బి నగర్ అసెంబ్లీ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశాలలో నివసిస్తున్న ప్రవాస భారతీయులందరు గర్వంగా మేము భారతీయులము అనే విధంగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. డిజిటల్ విప్లవాన్ని అతి సామాన్య వ్యక్తికి కూడా అందుబాటులోకి తెచ్చిన ఘనత కేంద్ర ప్రభుత్వానిది, రౌతు మంచివాడు అయితే గుర్రం బాగా స్వారీ చేస్తుంది అన్న చందంగా ఈ రోజు భారత దేశ ఔనత్యాన్ని, దశ దిశలు వ్యాపించిన ఘనత కూడా మన నరేంద్రమోడీ కి దక్కిందని తెలియ జేశారు. పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలి అనే మన తెలుగు నానుడికి ప్రతీకగా అయోధ్యలో బాల రాముని మందిరం ఎటువంటి మాత విద్వేషాలకు తావు ఇవ్వకుండా పూర్తి చేసి భారతీయుల సంస్కృతి సంప్రదాయాలను గౌరవించేవిధంగా మన అందరికి అందుబాటులోకి తెచ్చిన ఘనత కూడా మోడీదే అన్నారు. ఫిర్ ఏక్ బార్ మోడీ కా సర్కార్ అనే నినాదంతో ప్రతొక్క కార్యకర్త కార్యోన్ముఖులై నిబద్దతతో రాబోయే లోక్ సభ ఎన్నికలలో బూత్ స్థాయి నుండి కష్టపడి మల్కాజ్‌గిరి లోక్ సభ నియోజకవర్గాన్ని అత్యధిక మెజారిటీతో విజయం సాధించి మన నాయకులూ నరేంద్ర మోడీ కి కానుకగా ఇవ్వాలని కోరారు. తద్వారా దేశంలోనే అతిపెద్ద లోక్ సభ నియోజకవర్గమైన మల్కాజ్గిరిని ఉన్నతమైన స్థాయిలో ఉంచాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్రంలో వున్నా కాంగ్రెస్ సర్కారు అమలుకు అసాధ్యమైన హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిందని కానీ దేశంలో ప్రజలకు ఎటువంటి తాయిలాలు ప్రకటించకుండా అత్యంత పారదర్శకమైన అవినీతి రహిత పాలనను అందిస్తూ మెజారిటీ ప్రజల ఆకాంక్షల మేరకు పూర్తిగా అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను అందిస్తూ ముందుకు సాగుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో ముచ్చటగా మూడవసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవిధంగా ప్రజలు తమ ఓటు హక్కుతో ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీంద్ర గౌడ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, వనపల్లి శ్రీనివాస్ రెడ్డి , పార్లమెంట్ ఇంచార్జి గోలి మధుసూదన్ రెడ్డి , కార్పొరేటర్లు కొప్పుల నరసింహ రెడ్డి , రంగ నరసింహ గుప్తా, చింతల సురేందర్ యాదవ్ ,బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, నాయికోటి పవన్ కుమార్, కళ్లెం జీవన్ రెడ్డి , వెంకటేశ్వర్ రెడ్డి, పాదూరి కరుణ తదితరులు పాల్గొన్నారు.

### మందుబాబుల ఆగడాలు ..పట్టించుకోని పోలీసులు

నాగర్‌కర్నూల్,జిల్లా కేంద్రంలో మందుబాబుల ఆగడాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయి. ఇక్కడ తాగుబోతుల అడ్డాగా మారిపోయింది. విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ బహిరంగ మద్యపానంతో ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారు. చీకటి పడితే చాలు మందుబాబులు వాలిపోతుంటారు. తాగిన సీసాలను రోడ్లపై పగులకొట్టి పైశాచిక ఆనందం పొందుతారు. ఫలితంగా ఉదయం సాయంత్రం నడక కోసం వచ్చే వారు స్థానిక కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆ దారిలో నిత్యం స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట మద్యం సేవిస్తూ న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఆకాశ్ డిగ్రీ కళాశాల పక్కన గల పాడుబడ్డ బంగ్లా, రామ్‌నగర్‌కాలనీలోని చెరువుగట్టు, రవితేజ కాలేజ్ ప్రాంగణం, లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ వెనక సైడ్, అయ్యప్ప దేవాలయం, పరిసరాలు, శ్రీపురం రోడ్డులోని నాగనూలు చెరువుగట్టు, నాగనూలు రోడ్డులోని దర్గా పరిసర ప్రాంతాలు మందుబాబులకు అతి ముఖ్యమైన అడ్డాలుగా మారిపోయాయి. తాగిన మైకంలో మాటామాటా పెరిగి చిన్నచిన్న కారణాలతోనే కొట్టుకున్న ఘటనలు ఉన్నాయి. పోలీసులు నిత్యం పట్టణంలోని నిర్మానుష్య ప్రదేశాలను గమనిస్తూ పెట్రోలింగ్ చేస్తే ఫలితం ఉంటుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నగరం నడిబొడ్డున ఇంత బహిరంగంగా బహిరంగ మద్యపానం జరుగుతున్న పోలీసులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మందుబాబులపై కొరడా ఝుళిపించాలని కోరుతున్నారు.

## ఉత్తరాఖండ్ ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం




ఉత్తరాఖండ్ : వివాహం, విడాకులు, వారసత్వం వంటి విషయాల్లో అందరికీ ఒకే తరహా నిబంధనల కోసం ఉద్దేశించిన ఉమ్మడి పౌరస్మృతి బిల్లు కు ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఇటీవలే ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ బిల్లుకు తాజాగా ఆమోదం లభించింది. ఉత్తరాఖండ్ యూనిఫాం సివిల్ కోడ్ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము (ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము) బుధవారం సంతకం చేశారు. రాష్ట్రపతి ఆమోదంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది (యూనిఫాం సివిల్ కోడ్ బిల్లు చట్టంగా మారింది). ఇప్పటికే యూసీసీ బిల్లును ఆమోదించిన ఏకైక రాష్ట్రంగా నిలిచిన ఉత్తరాఖండ్ ఇక పోర్చుగీస్ పాలనలో ఉన్నప్పటి నుంచి గోవాలో ఉమ్మడి పౌరస్మృతి అమల్లో ఉంది.

యూసీసీ బిల్లులోని అంశాలు..

వివాహం, విడాకులు, భూమి, ఆస్తి, వారసత్వానికి సంబంధించిన వాటితో పాటు సహ జీవనానికి రిజిస్ట్రేషను వంటి అంశాలను యూసీసీ బిల్లులో పొందుపరిచారు. గిరిజనులను ఈ బిల్లు నుంచి మినహాయించారు. సహజీవనం వల్ల పుట్టిన పిల్లలు చట్టబద్ధమైన వారసులుగా ఉంటారని, భాగస్వామి నుంచి విడిపోయిన మహిళకు భరణం పొందే హక్కు ఉంటుంది. బహుభార్యత్వాన్ని నిషేధిస్తున్న బిల్లు.. ఆయా మతాలవారిని తమ ఆచారాల ప్రకారం వివాహాలు చేసుకొనేందుకు అనుమతించింది. ఉత్తరాఖండ్ ఉమ్మడి పౌర స్మృతి సహజీవనానికి ఆమోదం తెలుపుతూనే జంటల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నది. సహజీవనం చేయాలని, కోరుకునే వ్యక్తులు ముందుగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని, చట్టాన్ని అతిక్రమించే వారికి ఆరు నెలల జైలు, రూ.25వేల వరకు జరిమానా విధిస్తామని చెప్పారు. ఇక 21 ఏండ్లలోపున్న వ్యక్తులు సహజీవనం చేయాలనుకుంటే వారి తల్లిదండ్రులకు తెలిపే వెసులుబాటును రిజిస్ట్రార్‌కు కల్పించారు. తమ పేర్లను నమోదు చేసుకోకుండా నెల రోజులకుపైగా సహజీవనంలో ఉంటే.. వారికి మూడు నెలల జైలు లేదా రూ.10 వేల జరిమానా లేదా ఈ రెండు శిక్షలూ విధిస్తారు. సహజీవనం దాచినా లేదా తప్పుడు సమాచారమిచ్చినా.. వారికి కూడా మూడు నెలల జైలు, రూ.25 వేల జరిమానా లేదా ఈ రెండు శిక్షలూ విధిస్తారు. సహజీవనంలో విడిపోవాలన్నా రిజిస్ట్రార్‌కు తెలపాల్సి ఉంటుంది.

రెండేళ్ల కసరత్తు తర్వాత..

2022లో ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో యూసీని ప్రముఖంగా ప్రదర్శించింది.

## మహిళలకు ముష్టి.. నటి ఖుష్బూ వివాదాస్పద వ్యాఖ్యలు!

న్యూఢిల్లీ,సినీనటి, బీజేపీ నేత, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ సుందర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తమిళనాట రచ్చ లేపుతున్నాయి. డీఎంకే ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న పథకాలతో పాటు.. గతకొన్ని రోజులుగా తమిళనాట వినిపిస్తున్న డ్రగ్స్ వ్యవహారంపైనా ఆమె తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. మరోపక్క ఈమె చేసిన వ్యాఖ్యలపై డీఎంకే మహిళా విభాగం నిరసనకు తెరలేపింది!అవును... తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం మహిళలకు నెల నెలా వెయ్యి రూపాయలు ఇచ్చే పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఈ పథకాన్ని ముష్టి, భిక్షగా ఖుష్బూ సుందర్ అభివర్ణించారు. తాజాగా ఈ విషయాలపై స్పందించిన ఆమె... మహిళలకు వెయ్యి రూపాయలు ముష్టి వేసే బదులు, రాష్ట్రంలో డ్రగ్స్ వ్యాప్తిని నిర్మూలించాలని అన్నారు. ఈ వ్యాఖ్యలతో తమిళనాట పెను దుమారమే రేగింది. ఇదే సమయంలో స్టాలిన్ సర్కార్ మహిళా ఓట్ల కోసమే వెయ్యి రూపాయలు ముష్టి ఇస్తుందని.. ఈ క్రమంలో డ్రగ్స్ నిరోధించడం మాత్రం మరిచిపోయిందని.. తమిళనాట డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలిస్తే, ప్రజలు ప్రత్యేకంగా వెయ్యి రూపాయల భిక్షను తీసుకునే అవసరం ఉండదని అన్నారు. కాగా... సుమారు 2వేల కోట్ల రూపాయలకు సంబంధించిన డ్రగ్స్ కేసులో తమిళ సినీ నిర్మాత, డీఎంకే మాజీ నేత జాఫర్ సాధిక్ ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై స్పందించే క్రమంలో... పేద



మహిళల కోసం స్టాలిన్ సర్కార్ తెచ్చిన పథకాన్ని ముష్టి అనడంపై మాత్రం తీవ్ర దుమారమే రేగింది. ఇందులో భాగంగా... ఆమె చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా డీఎంకే మహిళా విభాగం నిరసనలు చేపట్టింది. ఈ క్రమంలో ఖుష్బూ సుందర్ దిష్టిబొమ్మలు దగ్ధం చేసి నిరసన తెలుపుతుంది. దీంతో... ఈ విషయాలపై ఎక్స్ వేదికగా స్పందించిన ఖుష్బూ... తాను చేసిన వ్యాఖ్యలు కేవలం డ్రగ్స్ మహమ్మారిని నియంత్రించడం కోసమే అని అన్నారు.

## సంపాదకీయం

**గురువారం 14-03-2024**

# బిజెపి గొంతులో పచ్చివెలక్కాయ ?

ఎన్నికల బాండ్ల వ్యవహారంలో సుప్రీం ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు రాజకీయ పార్టీల గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లు అయ్యింది. వివరాలు వెల్లడించాలని ఎస్‌బిఐని ఆదేశించిన నేపథ్యంలో ఇప్పుడు ఏం జరుగుతుందో అని దేశమంతా ఆసక్తిగా చూస్తోంది. రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్ల రూపంలో గుప్తనిధులను సమకూర్చిపెట్టే విధానానికి ఏకైక వ్యవహర్తగా, కర్తగా ఉన్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సోమవారం సుప్రీంకోర్టుకు పెద్ద షాక్ ఇచ్చింది. ఎన్నికల బాండ్ల వివరాలను ఎన్నికల సంఘానికి అంద చేయాలని ఆదేశించింది. ఇది గుప్తంగా ఉంచాల్సిన అవసరం లేదని పేర్కొంది. దీనికి గడువు ఇవ్వాల్సిన అవసరం కూడా లేదని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఇది ఒకరకంగా ప్రజాస్వామ్యంలో ఓ గట్టి నిర్ణయంగా చూడాలి. రాజకీయ పార్టీలు వివిధ వ్యాపారాలు, వాణిజ్య వర్గాల నుంచి డబ్బులు పోగేసుకుని ఎన్నికల్లో కర్చు పెట్టి అధికారంలోకి రాగానే ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయి. రాజ్యాంగవ్యతిరేకం అంటూ ఫిబ్రవరి 14న ఆ విధానాన్ని కొట్టివేసి, వాటి అమ్మకాలను నిలిపివేసిన సుప్రీం కోర్టు, గత నాలుగేళ్లలో అమ్మినబాండ్లు, వాటిని కొన్నవారి సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలనీ, ఈసీ ఆ వివరాలను మార్చి 13లోగా బహిర్గతపరచాలనీ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ తీర్పు వెలువడిన మూడు వారాలకు, గడువుకు కేవలం రెండు రోజుల ముందు, ఈ ప్రక్రియ అత్యంత సంక్లిష్ట మైనదనీ జూన్ 30 వరకూ గడువు పెంచాలనీ సుప్రీంకోర్టుకు ఎస్‌బిఐ విన్నవించుకుంది. సార్వత్రిక ఎన్నికల్లోగా ఈ బాండ్ల సంగతి తేల్చి, గోప్యతను ఛేదించి, సమస్త వివరాలను ప్రజలకు అందించాలని సుప్రీంకోర్టు సంకల్పిస్తే, ఎస్‌బిఐ ఇప్పుడు ఆ సదాశయాన్ని వమ్ముచేయడానికి ప్రయత్నిస్తున్నది. కోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉన్నానని అంటూనే ఎన్నికలు ముగిసేవరకూ రహస్యాన్ని దాచాలనుకుంటోంది. ఈ క్రమంలో ఇక లాభం లేదనుకున్న సుప్రీం వెంటనే వివరాలు సమర్పించాలని, గోప్యతకు ఆస్కారం లేదని కఠినంగానే ఆదేశించింది. వివరాలు వెల్లడించడానికి గడువు ఇవ్వాల్సిన అవసరమేమున్నదని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. సుప్రీం తీర్పును వమ్ము చేయకండి, అడ్డదారులు తొక్కకండి అని విపక్షపార్టీ నేతలతో సహా న్యాయకోవిదులు, మేధావులు అప్పట్లోనే ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. మోదీ ప్రభుత్వం ఆర్డినెన్సుతో తీర్పును వమ్ముచేయ వచ్చునని కొందరు అనుమానించారు. ఇప్పుడు బ్యాంకును అడ్డుపెట్టుకొని మోదీ ప్రభుత్వం కొత్త కుట్రలకు తెరదీస్తోందన్న విమర్శలు బలంగా వినిపించాయి. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమైనదని, ఏకపక్షంగా వుందని పేర్కొంటూ భారత అత్యున్నత న్యాయస్థానం ఆ పథకాన్ని రద్దు చేసింది. రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేసేందుకే బిజెపి ఈ ఎన్నికల బాండ్ల పథకాన్ని రూపొందించిన వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఈ తీర్పు మోడీ ప్రభుత్వానికి రుచించదు. తీర్పు అమలును దెబ్బ తీసేందుకు ఎస్‌బిఐ ద్వారా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. 2019 ఏప్రిల్ నుండి కొనుగోలు చేసిన ఎన్నికల బాండ్ల వివరాలన్నింటినీ తప్పనిసరిగా బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తాజా తీర్పు మేరకు ఈ నెల 15 కల్లా వెబ్‌సైట్లో పొందు పర్చాల్సి ఉంటుంది. బాండ్లను కొనుగోలు చేసిన వివరాలు, కొనుగోలు చేసిన వ్యక్తి పేరు, బాండ్ల విలువ వంటి వివరాలను అందచేయాలని కోరింది. ఆ వివరాలన్నింటినీ మార్చి 12కల్లా ఎన్నికల కమిషన్‌కు వెల్లడించాలని కోరింది. అయితే ఈ ఎన్నికల బాండ్ల లావాదేవీలకు సంబంధించిన వివరాలను వెల్లడించ డానికి మరికొంత సమయం కావాలంటూ ఎస్‌బిఐ మార్చి 4వ తేదీన సుప్రీంను ఆశ్రయించింది. జూన్ 30 వరకు గడువు కావాలని కోరింది. అంటే చెప్పిన పని పూర్తి చేయాలంటే ఎస్‌బిఐకి సుప్రీంకోర్టు ఇచ్చిన 21 రోజుల గడువుకు బదులుగా మరో 116 రోజులు కావాలని పేర్కొంది. అంటే లోక్‌సభ ఎన్నికలయ్యే వరకు ప్రజలు ఎన్నికల బాండ్ల వివరాలను తెలుసుకోకుండా చేయాలన్నదే దాని ఉద్దేశం. ఎస్‌బిఐ డిజిటలైజ్ చేయబడిన బ్రాంచిలో ఏ వ్యక్తి లేదా సంస్థ బాండ్‌ను కొనుగోలు చేసినా వెంటనే అది డిజిటల్‌గానే నమోదవుతుంది. బేరర్ బాండ్‌ను మరే ఇతర ఎస్‌బిఐ బ్రాంచీల్లోనైనా డిపాజిట్ చేయవచ్చు. దానికి కూడా డిజిటల్ రికార్డు వుంటుంది. అందువల్ల, ఎస్‌బిఐ కేవలం కుంటి సాకులు, బూటకపు కారణాలు చెప్పిందన్న విషయం స్పష్టమవుతోంది. దీంతో సుప్రీం గడువుకు ముందే గట్టి హెచ్చరిక చేసింది. దీనిని బయట పెట్టాల్సిందేనని పేర్కొంది. వివరాలు వెల్లడించాల్సిందేనని అటు ఎస్‌బిఐ తో పాటు, ఇసికి కూడా ఆదేశాలు ఇచ్చింది. ఇది ఓ రకంగా పాలక బిజెపికి మింగుడు పడని వ్యవహారంగా చూడాలి. ఇప్పటివరకు జారీ చేసిన, ఉపయోగించుకున్న ఎన్నికల బాండ్ల వివరాలు ప్రచురితం కాకుండా అడ్డుకోవడానికి మోడీ ప్రభుత్వానికి, పాలక బిజెపికి అనేక కారణాలు వున్నాయి. పైగా పరస్పరం ఇచ్చి పుచ్చుకునేందుకు వెసులుబాటు కల్పించేలా ఈ పథకాన్ని రూపొందించారంటూ కోర్టే స్వయంగా వ్యాఖ్యానించింది. బిజెపి అందుకున్న ఎన్నికల బాండ్ల వివరాలను ప్రచురించడం వల్ల బహిర్గతమయ్యే కోణం మరొకటి వుంటుంది. గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో బిజెపికి దాదాపు రూ.335 కోట్లు కార్పొరేట్ విరాళంగా ఇచ్చిన కంపెనీలు కనీసం 30 వున్నాయని ఓ అధ్యయనం వెల్లడించింది. ఒకసారి ఎన్నికల బాండ్ల వివరాలు బయటకు వస్తే, ముడుపులు తీసుకుని అవినీతికి పాల్పడినందుకు ప్రతిగా ఏమిచ్చారో నిర్ధారణ అవుతుంది. కేంద్ర దర్యాప్తు సంస్థల బలవంతపు చర్యలు, బ్లాక్‌మెయిలింగ్ ఎత్తుగడల ద్వారా నిధులు ఎలా వసూలు చేస్తున్నారో తెలిసి పోతుంది. దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చేసిన తరువాత కూడా ఈ కాస్తంత సమాచారానికే నెలలకొద్దీ సమయం అడుగుతుండడం అనుమానాలను రేకెత్తిస్తోంది. దశాబ్దాల క్రితమే బ్యాంకులు రాతకోతలు వదిలేసి, కంప్యూటర్ల వాడకం ఆరంభిస్తే, డిజిటల్ లావాదేవీల్లో అగ్రస్థానంలో ఉన్న ఓ అతిపెద్ద బ్యాంకు ఎన్నికల బాండ్ల లావాదేవీలకు మాత్రం కాగితాలనే వాడటం ఆశ్చర్యం. మొత్తంగా సుప్రీం ధర్మాసనం తాజా ఆదేవాలతో ఇక వివరాలు వెల్లడించక తప్పదు. తెలుసుకునే హక్కు కూడా దేశప్రజలకు ఉంది.

# కేంద్ర నిధులపై వాస్తవాలు-వక్రీకరణలు

న్యూఢిల్లీ,'నిజం కూడా ప్రతి రోజూ ప్రచారంలో ఉండాలి. లేకుంటే అబద్ధమే నిజంగా మారి దేశాన్ని నాశనం చేస్తుంది' డా. బిఆర్ అంబేద్కర్. 'నిజం గడప దాటితే లోపు.. అబద్ధం వెయ్యి మైళ్ళు ప్రయాణిస్తుంది. అయితే, నిజం గడప దాటిన మరుక్షణమే.. అబద్ధం అదృశ్యమవుతుంది' అంటుంటారు పెద్దలు. ఈ విషయం కేంద్ర నిధుల విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారానికి సరిగ్గా సరిపోతుంది. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం నుంచి తగినంత ఆర్థిక సాయం రావడం లేదని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గత కొంత కాలంగా అవాస్తవ ఆరోపణలు చేస్తున్నాయి. బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ ఇతర రాష్ట్రాలు కేంద్రం తమకు తక్కువగా నిధులు ఇస్తోందని పదేపదే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.మొన్నటిదాకా తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో వున్న బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇవే తప్పుడు ఆరోపణలు చేసింది. కానీ, బిజెపి అగ్రనాయకులు ఈ తప్పుడు ఆరోపణలను తిప్పికొడుతూ వచ్చారు. ఏటా కేంద్రానికి జమ అయ్యే కార్పొరేషన్, వెల్త్ ట్యాక్సు, సెంట్రల్ జియోటి, కస్టమ్స్, యూనియన్ ఎక్సైజ్ డ్యూటీ, సర్వీస్ ట్యాక్సు కలిపి ట్యాక్స్ పూల్‌లో జమ అవుతాయి. ఈ మొత్తం పన్నుల ఆదాయంలో 41% రాష్ట్రాలకు కేంద్రం పంచుతుంది. ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నిధులు విడుదల చేయడం దయతో ఏమీ కాదని, అది రాజ్యాంగ బాధ్యత అని, రాష్ట్రాల హక్కు అని బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పదే పదే మాట్లాడేవారు. కానీ, వాస్తవంగా గతంలో తెలంగాణలోని బిఆర్ఎస్ ప్రభుత్వం నిధులు సక్రమంగా వాడుకోకుండా, కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలంగాణలో అమలు చేయకుండా రాష్ట్రానికి నష్టం వాటిల్లిందని అభిప్రాయాలు సర్వత్రా ఉన్నాయి.ప్రభుత్వంని బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా 5 కిలోల చొప్పున రేషన్ బియ్యం సరఫరా చేసింది. కానీ, ఆనాటి సిఎం కెసిఆర్ గత పదేళ్లలో తెలంగాణలో కొత్త రేషన్ కార్డులే ఇవ్వలేదు.కొత్త రేషన్ కార్డులిస్తే, అందులో ఎక్కడ మోడీ ఫోటో పెట్టాల్సి వస్తుందోననే కుట్రతోనే కొత్త రేషర్ కార్డులను ప్రచురించిన పేదలకు తీవ్ర అన్యాయం జరిగింది. తెలంగాణ ప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వం రేషన్ బియ్యం ఉచితంగా ఇస్తుంటే అవన్నీ తామే ఇచ్చినట్లుగా బిఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. దేశంలో 4 కోట్ల మందికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం పేదలకు ఇళు నిర్మించి ఇస్తుంటే ఆ నిధులతోనే డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి, గొప్పగా చెప్పుకుంది. అలాగే, పేదలకు వైద్య సౌకర్యాలందించేందుకు ప్రజలకు అందించిన ఆయుష్మాన్ భారత్ సేవలను కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు అందకుండా చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కోట్లాదిమంది పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోంది.వీటిపై గ్రామీణ స్థాయిలో చాలా మందికి అవగాహన లేకపోవడం వల్ల లబ్ధి చేకూరడం లేదని కేంద్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది.ఈ కారణంగానే భారత్ సంకల్ప యాత్ర కేంద్రం శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాలు, ఎవరెవరు ఈ పథకాలకు అర్హులు అనే పూర్తి స్థాయి



అట్టడుగు స్థాయి వర్గాల ప్రజలకు వివరంగా చెప్పేందుకే ఈ పథకాన్ని రూపొందించడం జరిగింది. ప్రధాని మోడీ చేసిన సంక్షేమ కార్యక్రమాలన్నీ ఈ యాత్రలో ప్రతిబింబిస్తున్నాయి. ప్రధానంగా దేశంలోని గిరిజనులు, ఆదివాసీల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు, చర్యలను వివరించేందుకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ఎంతగానో తోడ్పడుతోంది.దీనిని నవంబర్ 15వ తేదీన ఆదివాసీ గౌరవ దివస్ సందర్భంగా స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీయే జెండా ఊపారు. ఈ పేజీ జార?ండ్‌లోని ఖుంటి జిల్లా వేదిక అయింది. ఆ తరువాత వివిధ ప్రాంతాలకు విస్తరిస్తున్నది. ఈ యాత్ర దేశంలోని 24 రాష్ట్రాల్లోని 68 జిల్లాలతో పాటూ కేంద్ర పాలిత ప్రాంతాల్లో సాగుతోంది.దేశ వ్యాప్తంగా 8,500 పై చిలుకు గ్రామ పంచాయతీల్లో ఈ మేరకు కొనసాగుతున్నాయి. గడిచిన పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమాలను గ్రామస్థాయిలో వివరిస్తూ ముందుకు సాగుతోంది.కేంద్ర పథకాల్లో ప్రధానంగా ఆయుష్మాన్ భారత్ పిఎంజెవై, ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ), ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ప్రధాన మంత్రి విశ్వకర్మ, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసిసి), ప్రధాన మంత్రి పోషణ్ అభియాన్, జల్ జీవన్ గ్రామాల సర్వే, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన తరంతో మ్యాపింగ్ (ఎస్‌విఎఎంఐటివి), జన్‌ధన్ యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత, గృహ నిర్మాణం, వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన పథకాలపై ఊరూరా , వాడవాడలా విసృతంగా ప్రచారం చేస్తున్నారు. కేంద్ర పథకాలతో ఇప్పటికే లబ్ధి పొందిన వారి నుంచి కొన్ని సూచనలు, సలహాలు సేకరిస్తున్నారు. ఈ సంక్షేమ పథకాల గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో వారినే అడిగి తెలుసుకుంటున్నారు. అబద్ధం దర్జాగా బతుకుతూ ఏదో ఒక రోజు చస్తుంది. కానీ, ఏనాటికైనా నిజమే భవిష్యత్‌కు చరిత్రగా మారిపోయి, నిత్యం వర్ధిల్లుతుందనే అందమైన అబద్ధాలను నమ్మిస్తూ, నటిస్తూ చెప్పే వారు గుర్తెరగాలి.

# ఎవరికి నష్టం,ఎవరికి లాభం?

హైదరాబాద్,మొత్తానికి త్వరలో జరగనున్న లోక్ సభ, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలకుగాను బిజెపితో తెలుగుదేశం పార్టీ పొత్తు కుదిరింది. ఇప్పటికే బిజెపి ప్రధాన పక్షంగా ఉన్న ఎన్‌డిఎ కూటమిలోని జనసేన పార్టీతో టిడిపి జత కూడి ఉన్నది. సీట్ల పంపకం స్థూలంగా జరిగినప్పటికీ బిజెపి, జనసేనలు ఏ స్థానాల నుండి పోటీ చేయాలనేది ఇంకా స్పష్టం కావాల్సి ఉంది.ఈ పొత్తులో ఎవరి ప్రయోజనాలు ఎంత , ఎవరి భవిష్యత్తు ఎంత అనేది పరిశీలించాల్సిన అంశాలు. ముందుగా ఐదేళ్ల క్రితం ఇదే ప్రధాని మోడీ దేశీయాంగశాఖ మంత్రి అమిత్ షాలు ఇదే చంద్రబాబు చేతిలో ఘోర అవమానాలు, వ్యక్తిత్వ హననాలకు సిద్ధమయ్యారు.నేడు బిజెపి నాయకులు, మోడీ, అమిత్ షాలు అవన్నీ మరిచి ఏం ఆశించి ఈ ఎన్నికల్లో చంద్రబాబుతో పొత్తు కుదురుచుకున్నారు? వ్యక్తిగతం కంటే పార్టీ హితమే మిన్నగా భావించి లోక్‌సభలో 400 స్థానాలు సాధించి చరిత్ర సృష్టించాలనుకునే రంధితో చంద్రబాబుతో చేతులు కలిపినట్లు అర్థమవుతోంది. ఇదే నిజమైతే ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సిపీని ఓడించి బాబును కూర్చోబెట్టడానికి కాదనేది అంతర్గతంగా కూడా స్పష్టమవుతోంది. మరి ఆ చరిత్ర కోసం వైఎస్ఆర్‌సిపితోనే పొత్తు కుదుర్చుకోవచ్చు అనే సందేహం వస్తుంది. కానీ జగన్ పొత్తులకు వ్యతిరేకి. పైగా బిజెపితో కలిస్తే ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ వర్గాలకు దూరం అవుతాయనే భయం కూడా జగన్‌కు ఉంటుంది. బిజెపితో పొత్తులో బాబు సుప్రయోజనం కూడా ఇమిడి ఉంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా రాకపోయినా అధికారంలోకి వచ్చే కమలదళం నీడలో కోర్టు కేసుల నుండి ఉపశమనం పొందలేదని ఊరడిల్లవచ్చునని చంద్రబాబు నమ్మకం.వ్యక్తిగతంగా చంద్రబాబుకు కలిగే ప్రయోజనాన్ని పక్కనపెడితే ఈ పొత్తు వల్ల తెలుగుదేశం పార్టీకి రాజకీయంగా ఒరిగేదేమిటి. ఎన్నికల సమయంలో అధికార పార్టీ ఆగడాలకు అవకాశం లేకుండా ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరుగుతాయనే ఒక భరోసా తప్ప గొప్పగా ఏదో జరుగుతుందని కనిపించట్లేదు. ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి చాలా నామమాత్రంగా ఉన్న పార్టీ. తమకు విద్యావంతులు నగరఓటర్లలో ఆదరణ ఉంటుందని బిజెపి వారు అనుకున్నా ఆ రాష్ట్రంలో ఈ నమ్మకం పనిచేయదు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, రైల్వేజోన్, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ తదితర అంశాలలో అధికారంలో ఉన్న బిజెపి నిర్వహణ నిర్లిప్తతలు ఆ రాష్ట్ర ప్రజల మదిలో ఇంకా సజీవంగానే ఉన్నాయి. ఈ అంశాల గురించి ఆలోచించేవారు ఎక్కువగా అనుకునే విద్యావంతులు, నగర ఓటర్లే.దేశాన్ని ప్రధాని మోడీ ఎంతో సమర్థంగా పరిపాలిస్తున్నారని ఆంధ్ర బిజెపి నాయకులు చెప్పుకుంటున్నప్పటికీ బయట పల్లకీల మోత సరే ఇంట్లో ఈగల మోత గురించి పట్టించుకోరు ఏంటని ఎందుకని ఆ నగర ఓటర్లు విద్యావంతులు ప్రశ్నిస్తూనే ఉన్నారు. ఇకపోతే ఆంధ్ర బిజెపిలోని నాయకులంతా తెలుగుదేశం గోత్రీకులే. తెలుగు దేశానికి వెన్నుదన్నుగా ఉంటే కమ్మ సామాజిక వర్గానికి చెందినవారే. ఈ పొత్తు కుదిరినా కుదరకపోయినా వారి బంధుజన సందోహం తెలుగుదేశం పార్టీకి విధేయంగా ఉండేవారే. కొద్దోగొప్పో కాపు సామాజిక వర్గం వారున్నా వారూ కుల బలాలతో నడిచే ఆంధ్ర రాజకీయాల్లో తమ సహజ ప్రత్యర్థులైన కమ్మ సామాజిక వర్గం వారికి వ్యతిరేకంగా పనిచేసే వారే.అంటే వారి ఓట్లు అటు కాంగ్రెస్‌కో, వైసిపికో బదిలీ అవుతాయి తప్ప తెలుగుదేశం బదిలీ కావు. అంటే క్షేత్రస్థాయిలో ఉన్న కొద్ది బిజెపి ఓట్లలో ప్రధాన భాగం పొత్తును అనుసరించి బదిలీకాక చెదిరిపోతాయి. ఇతర సామాజిక వర్గాల్లో అనగా బ్రాహ్మణ, వైశ్య లాంటి వర్గాల్లోనూ ఉత్తర భారతం నుండి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారిలోనూ ఉండె ఆర్ఎస్ఎస్, బిజెపి పరివారం ఓట్లే నికరంగా పొత్తుననుసరిస్తాయి. కానీ వీరి శాతం తక్కువ. కనుక మొత్తంగా చూస్తే ఈ పొత్తు వల్ల తెలుగుదేశంకి రాజకీయంగా ఒరిగేదేమీ లేకపోయినా వ్యక్తిగతంగా చంద్రబాబుకు ఆయన కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని స్పష్టమవుతోంది.తమతో పొత్తుకు బిజెపి సుముఖత చూపినా వైసిపి నిరాకరించినట్లు తెలుస్తున్నది. ఇప్పటిలా ఎప్పటికీ స్నేహంగా ఉందాం. కానీ పొత్తుగిత్తు జాంతానై అని కుండ బద్దలు కొట్టింది.



బిజెపితో పొత్తు ఉంటే ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీల ఓట్లు పడవని వైసిపికి స్పష్టంగా తెలుసు. తనకు విశ్వసనీయ ఓటు బ్యాంక్‌గా ఉన్న ఆ వర్గాలకు పొత్తుకు వైసిపి నో చెప్పింది. ఇలా వైసిపి నో చెప్పాకే 400 సీట్లు దాటాలనే లక్ష్యంతో ఉన్న బిజెపి టిడిపితో పొత్తుకు సిద్ధమైంది. మైనారిటీ వర్గాల ఓట్లు దూరమైనా ఫరవాలేదు, రాజకీయంగా నష్టపోయినా ఇబ్బంది లేదు, వ్యక్తిగతంగా తనకు, తన కుటుంబానికి ఎంతో ముఖ్యమని చంద్రబాబు భావించి బిజెపితో పొత్తుకు క్షణం ఆలస్యం చేయకుండా ఓకే అన్నాడు. అయినా బిజెపివారు నాంచినాంచి చంద్రబాబు వేచి చూసేలా చేశారు. అయినా చంద్రబాబు సహించి భరించి వారి పిలుపు కోసం ఎదురు చూసి బిజెపిని ప్రసన్నం చేసుకున్నాడు. దీంతో మైనారిటీ వర్గాల ఓట్లను టిడిపి కోల్పోయినట్లే. ఇది కూటమికి పెద్ద దెబ్బే. అయితే ఆ మేర హిందువుల ఓట్లు తమవైపు మల్ల కోసం వారు భావించి ఉండవచ్చు. కానీ హిందూ మతం పేరుతో ఓట్లు ఒక కూటమికి మల్లె అవకాశం రాష్ట్రంలో ఉందా. వామపక్ష కుల, ఫ్యాక్షన్ ముఠాల ప్రభావంలో రాజకీయాలు నడిచే ఆంధ్రప్రదేశ్‌లో హిందూ మతం పేరుతో ఓట్లు మల్లుతాయనుకోవటం భ్రమే.ఈ పొత్తు వల్ల బిజెపి ఆ రాష్ట్రంలో రాజకీయంగా చాలా నష్టపోతున్నది. లోక్‌సభలో 400కు పైగా సీట్లు సాధించాలన్న తక్షణ ప్రయోజనం యావలో దీర్ఘకాలంలో ఆ రాష్ట్రంలో బలపడే అవకాశాలను చేజేతులారా సమాధి చేసుకున్నది. ఈ ఎన్నికలు వరకు బిజెపి వేచి చూసే వరకు బాగుండేది. ఈసారి ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోతే అది చాలా బలహీనపడింది. రాజకీయ శూన్యత ఏర్పడేది. ఆ పరిస్థితి చక్కగా ఉపయోగించుకోగలిగితే బిజెపి కచ్చితంగా బలపడేది. జనసేన బిజెపిలో విలీనం అయ్యే అవకాశం ఉండేది. కానీ ఒకవేళ ఎన్నికల్లో తెలుగుదేశం గెలిస్తే బిజెపి పరిస్థితి మాత్రం ఎదుగుబొడుగు లేకుండా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటుంది. నేడు పోటీ చేసిన స్థానాల్లో కొన్ని బిజెపి గెలుచుకున్నా ఒకరిద్దరు కేంద్ర మంత్రులు. రాష్ట్రంలో గెలిచినా రాష్ట్రంలో ఒకరిద్ద కూటమి బిజెపి మంత్రులు కావచ్చు. అలాగే ప్రస్తుతం టిడిపి ఎంపీలు కూడా ఒకరిద్దరు మంత్రులు అయ్యే అవకాశం ఉంది. కాగా ఈ మొత్తం ఎన్నికల పొత్తులు సీట్ల సర్దుబాట్లలో పిచ్చి పువ్వు అయినది పవన్ కళ్యాణ్. ఎన్నికల అనంతరం బిజెపిలో విలీనం కావటమో, ఆంధ్ర రాజకీయ యవనిక నుండి అదృశ్యం కావడమో ఖాయంగా కనిపిస్తున్నది.

## సిఎఎతో ప్రజలకు నష్టం లేదు

గౌహతి,పౌరసత్వ సవరణ చట్టంసీఏఏ నిబంధనలను కేంద్రం నోటిఫై చేయడంతో ఎవరికీ నష్టం ఉండదని, కొత్తగా ఎవరూ దేశంలో ప్రవేశించే అవకావం లేదని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ అన్నారు. అస్సాం రాష్ట్రంలో నెలకొన్న ఆందోళనలపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ స్పందించారు. ఈ చట్టంతో లక్షల మంది అస్సాంలోకి ప్రవేశిస్తారనే భయాలు ప్రజల్లో నెలకొనడంపై మాట్లాడారు. అవసరమైతే తాను రాజీనామా చేయడానికైనా సిద్ధమేనని ప్రకటించారు. శివసాగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ' నేను అస్సాం పుత్రుడిని. నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సీ)కి దరఖాస్తు చేయకుండా ఒక్కరికైనా కొత్త చట్టం కింద పౌరసత్వం లభిస్తే..

# సన్నరకం ధాన్యం సాగుపై రైతుల ఆసక్తి

నిజామాబాద్,జిల్లాలో యాసంగి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. యాసంగిలో సన్న వరి వేయడంతో రైతులు సాగులో నిమగ్నమయ్యారు. దొడ్డురకాలకు డిమాండ్ లేకపోవడంతో సన్న రకాలపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా సన్నబియ్యం ధరలు అనూమ్యంగా పెరగడం, మార్కెట్లో డిమాండ్ పెరగడంతో రైతులు ఈ రకాలకు మొగ్గు చూపారు. దీంతో అమ్మకాల్లో పెద్దగా ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. గతేడాది నుంచి ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు. రైతులు ఆరుతడి పంటలను సైతం ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. జిల్లాలో పంటల సాగు వాస్తవ పరిస్థితిని తెలుసు కునేందుకు వ్యవసాయ అధికారులు క్లస్టర్‌ల వారీగా క్రాప్ బుకింగ్‌ను చేస్తున్నారు. ప్రతి గ్రామ పరిధిలోకి వ్యవసాయశాఖ అధికారులు వెళ్లి క్రాప్ బుకింగ్ యాప్ ద్వారా సర్వే నెంబర్‌లను నమోదు చేస్తున్నారు. సర్వే మ్యాప్‌లో రైతులు వేసిన పంటల వాస్తవ పరిస్థితిని గుర్తించి విస్తీర్ణాన్ని నమోదు చేస్తున్నారు. ఏయే పంటలు వేశారో వివరాలను నమోదు చేస్తున్నారు. వరితో పాటు ఏ పంటలు ఎక్కువగా వేశారో వాటిని నమోదు చేస్తున్నారు. పంటల మార్పిడికి రైతులు మొగ్గుచూపారా లేదా అనే అంశాలను ఈ క్రాప్ బుకింగ్ ద్వారా వివరాలను తెలుసుకుంటున్నారు. మొత్తం జిల్లాలో సాగైన పంటల విస్తీర్ణం, వాటి వివరాలను వెంటనే ట్యాబ్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో గత సంవత్సరంతో పోలిస్తే 30వేల ఎకరాల్లో వరి సాగు తగ్గింది. ప్రస్తుతం మూడున్నర లక్షల ఎకరాల్లో సాగు కావడం వల్ల 8లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి రానుంది. జిల్లాలో వరి ఎక్కువ సాగు చేయడం వల్ల రైతులు ధాన్యం అమ్ముకునేందుకు తిప్పలు పడే పరిస్థితులు ఏర్పడనున్నాయి. జిల్లాలో వర్ని, మోస్రా, చందూర్, కోటగిరి, రుద్రూర్ మండలాల పరిధిలో వరి సాగును ముందుగా చేశారు. ఈ నెలాఖరు నుంచి వరి కోతలను మొదలు పెట్టనున్నారు. ఈ మండలాల పరిధిలోని రైతులు ఇప్పటికే సూర్యాపేట, కర్నూల్, బల్లారి వ్యాపారులతో ఒప్పందాలను చేసుకుంటున్నారు. వరికోతలు మొదలుపెట్టగానే వారికే ధాన్యాన్ని అమ్మేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో సన్న రకాలు సాగుచేసిన రైతులతో రైస్ మిల్లర్‌లు కూడా ఒప్పందాలు చేసుకుంటున్నారు. తమ మిల్లులకు దగ్గరగా ఉన్న గ్రామాల్లో రైతులు వేసిన పంటలను కొనుగోలు చేసేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నారు. జిల్లాలో పంటల సాగు మొదట తగ్గినా.. రైతులు ఆరుతడి పంటలను వేయడంతో సాగు పెరిగిందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. క్రాప్ బుకింగ్ ద్వారా పంటల వాస్తవ పరిస్థితిని నమోదు చేశామని తెలిపారు. వరి కొంతమేర తగ్గిన ఎర్రజొన్న, సజ్జ, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలు పెరిగాయన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే కొంతమేర పంటలు తగ్గినా ఎక్కువ మొత్తంలోనే సాగు కొనసాగించారు. జిల్లా వ్యాప్తంగా గడిచిన నెల రోజులుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న క్రాప్ బుకింగ్ వల్ల పంటల సాగు వాస్తవ పరిస్థితి బయటపడింది. గత సంవత్సరంకంటే లక్ష ఎకరాల వరకు వరి తగ్గుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. వేసినా.. పంటల సాగు తగ్గలేదు. జిల్లాలో శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల ఆయకట్టుతో పాటు గుత్ప, అలీసాగర్, లక్ష్మి కాల్వల కింద వరి ఎక్కువగా సాగు చేశారు. వీటితో పాటు రామడుగు రిజర్వాయర్ కింద వరి వేశారు. జిల్లాలోని ప్రాజెక్టుల ఆయకట్టులేని ప్రాంతాల్లో బోర్ల కింద వరిసాగు కొనసాగించారు. ప్రభుత్వం కొనుగోలు చేయకున్నా ధాన్యాన్ని అమ్ముకునేవిధంగా ఎక్కువ మొత్తంలో సన్న రకాలను వేశారు. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం యాసంగిలో సన్న రకాలను 55 శాతానికి పైగా రైతులు వేశారు. దొడ్డు రకాలను తగ్గించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకున్న వ్యాపారులు, రైస్ మిల్లర్‌లకు అమ్ముకునేవిధంగా ఏర్పాట్లను చేసుకున్నారు.

# పకడ్బందీగా పదోతరగతి పరీక్షలు

హైదరాబాద్,పదో తరగతి పరీక్షల నిర్వహణ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి సీరియస్‌గా ఉన్నారు. గతంలో అక్రమాలు జరిగిన నేపథ్యంలో పక్కాగా పరీక్షల నొఇర్వహణకు ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలోనే ఈసారి కఠిన ఆంక్షలతో పదో తరగతి పరీక్షలను నిర్వహించనున్నారు పరీక్షా కేంద్రాలవద్ద నో సెల్ ఫోన్ జోన్స్ ను ఏర్పాటు చేశారు. పరీక్ష జరిగేంత వరకూ అవసరమైతే జామర్లతో సిగ్నల్స్ ఆఫ్ చేయించే యోచనలో అధికారులు ఉన్నారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, స్క్వాడ్, సిబ్బందికి ఫోన్లను అందుబాటులో లేకుండా చూడనున్నారు. రూల్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్న పత్రాలు బయటికి వెళ్లకుండా, మాస్ కాపీయింగ్ జరుగకుండా కట్టుదిట్టంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత ఏడాది జరిగిన ఘటనల నేపథ్యంలో ఈసారి పక్కాగా పరీక్షలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. 5.80 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ క్రమంలో మార్చి 18 నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. గతేడాది వాట్సాప్‌లో ప్రశ్నపత్రాలు హల్‌చల్ చేసిన నేపథ్యంలో అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పరీక్షాకేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్క్వాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఇక తనిఖీలకు వచ్చే అధికారులు, కలెక్టర్లు, పోలీస్, విద్యాశాఖ ఉన్నతాధికారులు సెంటర్లల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లడాన్ని అనుమతించరు. వీరు తమ సెల్‌ఫోన్లను పరీక్ష కేంద్రం వెలుపలే పెట్టాల్సి ఉంటుంది. పోలీసులు తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా 2,676 పరీక్షాకేంద్రాలను ఏర్పా టు చేశారు.ఆయాతేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే సైన్స్ పరీక్షకు మాత్రం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 వరకు, ఒకేషనల్ కోర్సుకు ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతాయి. పరీక్షల నిర్వహణ దృష్ట్యా రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఏమైనా సమస్యలుంటే 040 -23230942 నంబర్‌ను సంప్రదించవచ్చు. ఈ పరీక్షల నిర్వహణ దృష్ట్యా ఇప్పటికే 12 మంది ఉన్నతాధికారులను జిల్లాస్థాయి అబ్జర్వర్లుగా నియమించారు. విద్యార్థుల హాల్‌టికెట్లను ఇప్పటికే స్కూళ్లకు పంపించగా, విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్నిచ్చారు. విద్యార్థులు హాల్‌టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో పరీక్షాకేంద్రాల సమీప స్టేషన్ వరకు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇప్పటికే ఎస్సెస్సీ బోర్డు నామినల్‌రోల్స్, ఫొటో అటెండెన్స్ షీట్లు జిల్లాలకు చేర్చగా, తాజా గా ఓఎమ్మార్, ప్రశ్నపత్రాలు,

# కేన్స్ సెమికాన్ సంస్థ తరలకుండా చూడాలి

హైదరాబాద్, గత పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకువచ్చేందుకు చేసిన కృషి నిష్ఫలమవుతుందని మాజీ మంత్రి కెటి రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. సెమి కండక్టర్ రంగంలో అత్యంత కీలకమైన పెట్టుబడిగా భావిస్తున్న కేన్స్ సెమికాన్ సంస్థ తెలంగాణ నుంచి గుజరాత్ కి తరలిపోతున్నట్లు వచ్చిన వార్తలు పై కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కంపెనీ గతంలో కర్ణాటక రాష్ట్రానికి వెళ్లేందుకు సిద్ధమైనప్పుడు ఎన్నో ప్రయత్నాలు చేసి, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా ఒప్పించామన్నారు. కంపెనీ కొంగరకలాన్ లో ఫాక్స్ కాన్ పరిశ్రమకు దగ్గరగా భూమి కేటాయింపు కావాలంటే, కేవలం పది రోజుల లోపే అవసరమైన భూమిని కేటాయించి, కంపెనీని ఒప్పించగలిగినట్లు కేటీఆర్ తెలిపారు. అయితే ఇప్పుడు ఇదే కంపెనీ గతంలో ప్రభుత్వం మారిన తర్వాత తెలంగాణ నుంచి గుజరాత్ కి తమ పెట్టుబడులను తరలిస్తున్నట్లు వచ్చిన వార్తల పైన కేటీఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్ లో స్పందించారు. ఈ కంపెనీ క్లాంఃం యూనిట్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంతో పాటు, సెమి కండక్టర్ పరిశ్రమ ఈకో సిస్టమ్ కి అత్యంత కీలకమైనదని, ఈ పరిశ్రమ వస్తే ఈ రెండు రంగాల్లో తెలంగాణ రాష్ట్రం మరింత పురోగతి సాధించే అవకాశం ఉంటుంద న్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించి... చర్యలు నిర్వహించి తెలంగాణ రాష్ట్రంలోనే తమ పెట్టుబడులను కొనసాగించేటట్లు ఒప్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు.

# ఎలా విస్మరిస్తారు

అమరావతి,ఎన్‌డిఏలో టిడిపి చేరడంతో ఇప్పుడు బిజెపి ఏపి ఎన్నికల్లో కీలకం కాబోతున్నది. అయితే విభజన తరవాత బిజెపికి పెద్దగా ఆదరణ దక్కలేదు. ఇప్పుడు టిడిపి-జనసేనలతో కలసి పోరాడుతున్న వేళ ప్రజలకు ఎలాంటి హామీలను ఇస్తారన్నదే ముఖ్యం. ఎలా వారి మనసులు గెల్చుకుంటారన్నది కూడా ముఖ్యం. అధికారం నిలుపుకోవడం కోసం బిజెపి దక్షిణాదిలో ఎక్కువ సీట్లు సంపాదించే క్రమంలో పొత్తులకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇంతకాలం ఎపిలోనూ పాగా వేస్తామని అంటూ వచ్చిన నేతలు ఇప్పుడు టిడిపి కలసి పోటీచేయబోతున్నారు. తాడూ బొంగరం లేని చోట ఆట ఎలా ఆడుతారో బిజెపిని చూసి నేర్చుకోవాలేమో. ఎందుకంటే ఏపి విషయంలో బిజెపి తీరు దారుణంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ చేసిన నిర్వాకాలను ఎండగడుతూ వచ్చిన బీజేపీ కూడా తాము అధికారంలో లేని రాష్ట్రాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన అనంతరం... విభజిత ఆంధ్ర ప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని పట్టించుకోలేదు. తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేయక పోగా, పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లో పేర్కొన్న రెవెన్యూలోటు భర్తీ, వెనుకబడిన 7 జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖకు రైల్వేజోన్ తదితర కీలకమైన అంశాలను; పార్లమెంట్ సాక్షిగా ఇస్తామని వాగ్దానం చేసిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశాన్ని పక్కన పెట్టేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం 9వ షెడ్యూల్‌లో 91 సంస్థలు, 10వ షెడ్యూల్‌లో 142 సంస్థలు ఉన్నాయి. వీటిని రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభజన; ఉద్యోగుల విభజన; ఆస్తులు, అప్పులు, ఆదాయ విభజన వంటి అంశాలు ఇంకా పూర్తికాలేదు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం అని బీజేపీ చెబుతోంది. ప్రత్యేక హోదా వల్ల ఒరిగేదేమిటని ప్రశ్నించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు తన ఉనికి కోసం బిజెపి పంచన చేరింది. ఆంధప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు.. పదేళ్లు ఇవ్వాల్సిందేనని విభజన బిల్లు ఆమోదం పొందే సందర్భంలో రాజ్యసభలో పట్టుబట్టి, గొంతెత్తి పోరాడిన బీజేపీ నేతలు ప్రత్యేక హోదాను పక్కన పెట్టిన తీరు మోసం చేయడం తప్ప మరోటి కాదు. రాజకీయ కారణాల వల్లనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని ప్రజలకు కూడా అర్థమైంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై చర్చ మరోసారి మొదలైంది. కేంద్రం నియంతృత్వ ధోరణిని అవలింబిస్తోందని ప్రాంతీయపార్టీల నేతలు అంటున్నారు. ఇదే సమయంలో సమీప భవిష్యత్తులో దేశంలో చోటు చేసుకోబోయే రాజకీయ పరిణామాల్ని సైతం చర్చిస్తున్నారు. గత కొంతకాలంగా ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రాలతో సంప్రదించకుండా కొన్ని అంశాల్లో ఏకపక్షంగా తీసుకొంటున్న నిర్ణయాలతో ఆందోళన చెందుతున్నారు. కేంద్రంలో ఇటీవల వరకూ ఎవరు అధికారంలోకి వచ్చినా ఏకపక్ష పోకడలు పోవడం ఎక్కువగా కనిపిస్తోంది. కేంద్రంలో సుదీర్ఘ కాలం అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు... రాష్ట్రాలను చిన్నచూపు చూసేది. రాజకీయ ఫిరాయింపులను ప్రోత్స హించింది. దీంతో దానికి వ్యతిరేకంగా దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. ప్రాంతీయ అస్తిత్వం, ఆత్మగౌరవం, రాష్ట్రాల హక్కుల పరిరక్షణ అనే అంశాల ఆధారంగానే అవి ప్రజల విశ్వాసాన్ని చూరగొని అధికారంలోకి రాగలిగాయి. ఇప్పుడు బిజెపి కూడా అదే పద్దతిలో రాష్ట్రాలను చూస్తోంది. విభజన హామీలను నెరవేర్చే విషయంలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణకూ న్యాయం జరగలేదు. ఇందుకు కూడా రాజకీయాలే కారణం. విభజన బిల్లులో పేర్కొన్న ప్రకారం తెలంగాణకు ఇవ్వాల్సిన కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా; నీతి ఆయోగ్ సిఫార్సు మేరకు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలకు రూ. 24,000 కోట్ల ఆర్థిక సాయం వంటివి అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రాలను బలహీన పర్చడం వలన సాధించేదేమీ ఉండదని ప్రధాని నరేంద్ర మోదీ గ్రహించడం లేదు. ఇది ఓరకంగా ప్రజలను విస్మరించడమే అని బిజెపి కూడా గుర్తించడం లేదు. రాజ్యాంగ బద్ధంగా లభించాల్సిన నిధులు, హక్కులు బదలాయించి సమాఖ్య స్ఫూర్తిని చాటుతామన్న తొలినాళ్ల హామీలను మోడీ విస్మరించారు. ఈ క్రమంలో పొత్తులతో ముందుకు వస్తున్న బిజెపి ప్రజలకు ఏ రకంగా హామీలు ఇస్తుందన్నది ఆసక్తిగా మారింది.

### తమిళనాడులో రూ.100 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్

పుదుకోట్టై,తమిళనాడులోని పుదుకోట్టై జిల్లాలోని మిమిసాల్ గ్రామంలోని రొయ్యల ఫారంలో కస్టమ్స్ అధికారులు రూ.100 కోట్లకు పైగా విలువైన హాషీష్ ఆయిల్, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల మండపం సమీపంలో రూ.108 కోట్ల విలువైన 99 కిలోల హాషీష్‌ను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. శ్రీలంకకు అక్రమ రవాణా చేసేందుకు రొయ్యల ఫారమ్‌లో హాషీష్, గంజాయి వంటి డ్రగ్స్ పెద్ద మొత్తంలో సేకరించినట్లు సమాచారం అందిందని కస్టమ్స్ శాఖ అధికారి ఒకరు తెలిపారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సమీపంలోని వ్యక్తుల సమక్షంలో తాళం పగులగొట్టి హాషీష్ ఆయిల్, గంజాయి నింపిన 48 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. పొలంలో విద్యుత్ సరఫరా లేనందున నిషేధిత పదార్థాన్ని సమీపంలోని కస్టమ్స్ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఇక్కడ పరీక్షించిన అనంతరం బ్యాగులో నుంచి రూ.110 కోట్ల విలువైన 100 కిలోల హాషీష్, రూ.1.05 కోట్ల విలువైన 876 గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) యాక్ట్ 1985, కస్టమ్స్ యాక్ట్ కింద స్వాధీనం చేసుకున్నారు.

# వందరోజుల్లో ఆగమాగం చేసిండ్రు



కరీంనగర్ : రాష్ట్రంలో ఇప్పుడు ఉన్న పరిస్థితులను చూస్తే దుఃఖం వస్తోందని బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల శంఖారావంలో భాగంగా కరీంనగర్‌లో మంగళవారం నిర్వహించిన కదనభేరిలో బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 'కెసిఆర్ ఉన్నప్పుడు ఒక్క ఎకరం పొలం అయినా ఎండిందా?' అని ప్రశ్నించారు. కెసిఆర్ ఉన్నప్పుడు పచ్చటి పొలాలు ఉంటే.. 24 గంటల కరెంటు ఉంటే.. ఇంతమాయిల్లమే అవన్నీ ఎందుకు మాయమైనాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతులపై ప్రేమ ఉంటే రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు వచ్చేవా అని ప్రశ్నించారు. కెసిఆర్ ఉన్నప్పుడు ఒక్క ఏకరం పొలం అయినా ఎండిందా? అని ప్రశ్నించారు. మరి ఇవాళ ఏం బీమా వచ్చింది. ఈ బీమార్ ఇట్లనే ఉండాలా? మళ్లీ తెలంగాణ ఆత్మహత్యలు రావాలా? అని ప్ర జలను ప్రశ్నించారు. తాము ఏంచేసినా పథకం ప్రకారం చేశామని ప్రజలకు చెప్పారు. తెలంగాణలో వ్యవసాయ స్థిరీకరణ జరగాలని వ్యవసాయ పాలసీ పెట్టామని అన్నారు. ఎవరూ అడగకపోయినా, ఎవరూ ధర్నా చేయకపోయినా రైతుబంధు తీసుకొచ్చామని చెప్పారు. ఇండియాలోనే మొట్టమొదటిసారిగా రైతుబంధు పథకం ప్రారంభించింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. రైతుల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమా తీసుకొచ్చాం.. కానీ ఇవాళ దాని గురించి ఏ వివరాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వేసే ముందు రాష్ట్రానికి ఏవిధంగా పరిశ్రమలు వచ్చాయి.. ఐటి వచ్చింది.. రాష్ట్ర జిఎస్‌డిపి పెరిగింది.. ఏ విధంగా తలసరి ఆదాయం పెరిగిందనేది ప్రజలందరి ఆలోచన. ఈ కాంగ్రెస్ పాలకులు బోగస్ మాటలు చెప్పి జనాలను మాయచేశారని. రైతులకు బోనస్ ఇస్తామని ఎన్నికల ముందు చెప్పారని.. మొన్న వానాకాలం పంటలకు బోనస్ ఇచ్చిండ్రా అని ప్రశ్నించారు. పోనీ యాసంగికి ఇస్తామని చెబుతున్నారా? అని అడిగారు. బోనస్ అనేది బోగస్ అయ్యిందన్నా రు.

కాళేశ్వరం ఎందుకు కట్టినమో వివరిస్తా

కాళేశ్వరం ప్రాజెక్టులోని వంద కాంపోనెంట్లలో మేడిగడ్డ బ్యా రేజి ఒకటని అన్నారు. అందులో కొంత ఇసుక జారి రెండు పిల్లర్లు కుంగితే.. ఏదో ప్రళయం బద్ధలైనట్లు, దేశమే కొట్టుకుపోయినట్లు పేరు. రెండు మూడు రోజుల తర్వాత టివిలో కూర్చుంటున్నానని.. కాళేశ్వరం సంగతి ఏంటి? ఎందుకు కట్టినమో వివరించానని చెప్పారు. కరీంనగర్ జిల్లాలో నీళ్లు వచ్చినయంటే అది కాళేశ్వరం పుణ్యమే అని కెసిఆర్ అన్నారు. ఏవిధంగా మిడ్ మానేరు ఎల్ఎండి నిండి ఉం టుండే.. చెరువులు, చెక్‌డ్యాంలు మత్తళ్లు దుంకుతుండే అని తమ ప్రభుత్వ సమయంలో పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. కానీ ఇవాల్టి పరిస్థితిని చూస్తుంటే మనసుకు దుఃఖం వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కండ్ల ముందే ఇంత తొందరగా కరెంటు మాయం కావడం లేదు. అనేకచోట్ల రైతులు పొలాలు కాలబెట్టడం, గొర్లు, గొడ్లను మేపడం సోషల్ మీడియాలో చూస్తున్నామని చెప్పారు. రైతులు అట్ల నాశనమైతుంటే కూడా.. పేగులు మెడలేసుకుంటా.. పండబెట్టి తొక్కుతా అనే డైలాగులు తప్పితే... రైతు సోదరులారా భయపడకండి అని కనీస ధైర్యం చెబుతున్నారా? అని ప్రశ్నించారు.

ఒక్క పన్ను ఊగితే.. 32 పండ్లు రాలగొట్టుకుంటామా?

ఒకప్పుడు ఇదే ఎస్ఆర్ఎస్‌పికి నీళ్లు తక్కువ పడితే..సింగూర్ డ్యామ్ నుంచి తెచ్చి వరంగల్ దాకా పంటలు కాపాడినమని కెసిఆర్ గుర్తుచేశారు. ప్రభుత్వం అంటే అట్ల దమ్ము ధైర్యం ఉండాలని అన్నారు. రైతాంగాన్ని కాపాడాలనే ప్రేమ ఉంటే ఇవాళ రాష్ట్రంలో ఈ పరిస్థితి రాకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ఎంతసేపు మేడిగడ్డ.. ఈ గడ్డచూపి కెసిఆర్‌ను ఏమైనా బద్నాం చేయొచ్చా అని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. 'మన పండ్లలో ఒక పన్ను ఒదలైతది.. ఏ పన్ను ఊగుతదో ఆ పన్ను బాగు చేసుకుంటాం. అంతేకానీ 32 పండ్లు రాలగొట్టుకుంటామా?' అని ప్రశ్నించారు. ఒక అంకుశంలా బిఆర్ఎస్ ఉండాలని కెసిఆర్ అన్నారు. బిఆర్ఎస్ బలం.. తెలంగాణ బలమని అన్నారు. ఎందుకంటే బిఆర్ఎస్ తెలంగాణ దళం. తెలంగాణ గళమని చెప్పారు. 'శాసనసభలో గానీ.. పార్లమెంటులో గానీ అన్నివిధాలుగా రాష్ట్రాన్ని, కేంద్రాన్ని ఒప్పించి.. మెడలు వంచి బ్రహ్మాండంగా పనులు చేయాలంటే బిఆర్ఎస్ ఉండాలని అన్నారు. ఎన్నికల తర్వా త గెలిచిన వాళ్లకు మూడు నెలల దాకా వాళ్లను పనిచేయనివ్వండి.. వాళ్ల వ్యవహారం ఏంటో చూద్దాం.. వాళ్లకు అధికారం వచ్చిందనే అక్కసుతో ఉండొద్దు. నాలుగు తర్వాత కా ర్యాచరణ మొదలుపెడదాం అని చెప్పారు. ఎన్నికల ముందు ఇప్పుడే వెళ్లి రూ.2 లక్షల రుణం తెచ్చుకోండ్రి.. డిసెంబర్ 9వ తేదీన మొత్తం రుణమాఫీ చేస్తానని చెప్పారు. కానీ చేయలేదు. అందుకే ఇవాళ బిఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు' అని చెప్పారు. చేనేత కార్మికుల కోసం బతుకమ్మ చీరలు తెచ్చాం%ా% తమాషా కోసం తే సహాయం. 'ఆనాడు ఉద్యమంలో నేను.. ప్రొఫెసర్ జయశంకర్ సిరిసిల్ల నుంచి పోతుంటే మధ్యరాత్రిపూట కార్ల లైట్లలో గోడలపై ఆత్మహత్యలు చేసుకోవద్దు..చావు ??సమస్యలకు పరిష్కారం కాదు' అని అనుకున్నాం. వాటిని చూసి ఏడ్చినం అన్నారు. 'సిరిసిల్లలో ఒకటే రోజు 11 మంది చేనేత కార్మికులు చనిపోతే.. పార్టీ నుంచి రూ.50 లక్షలు తెచ్చి మీకు దండం పెడుతం.. ఓ ఏడాది వరకు సావకుర్రి.. తెలంగాణ వచ్చేదాక బతకండి.. మేం మిమ్మల్ని బతికించుకుంటాం' అని గుర్తుచేశారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు వేసుకునే యూనిఫాంలు.. పండుగలకు పేద మహిళలు బట్టలు కొనుగోలు చేయలేని వారి కోసం బతుకమ్మ చీరలు తెచ్చి అందజేశాం.

కాంగ్రెస్ వంద రోజుల్లోనే విఫలం

మంచినీరు, సాగునీటి సరఫరాలో, కరెంటు సప్లయ్, ప్రజా సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టకపోతే వాళ్లలో నిర్లక్ష్యం, అహంకారం మరింత పెరుగుతూ ఉంటుంది. ఈ ఎన్నికల్లో గులాబీ జెండా ఎంత బలంగా ఎగిరితే.. బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన అంత బలంగా, కాపలాదారుగా కొట్లాడుతుందని భరోసా ఇచ్చారు. 'రాష్ట్రంలో మంచినీళ్లకు, కరెంటుకు ఎందుకు సమస్యలు వస్తున్నాయో నాకు అర్థం కావడం లేదు. మేం ఎంతో శ్రమించి ఇంటింటికీ మంచి నీళ్లు ఇవ్వడం కోసం మిషన్ భగీరథ పథకం తీసుకొచ్చింది' అని అన్నారు. 'ఆదిలాబాద్ గోండు గూడెం నుంచి నల్లగొండ లంబాడీ తండా దాకా అందరికీ మంచినీళ్లు అందేలా చూసినం' అన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వానికి ఆ పథాకాన్ని నడిపే తెలివిలేదా..ఎందుకు సమస్యలు వస్తున్నయ్..?' అని ప్రశ్నించారు. 'ఇయ్యాల మళ్ల మీరు ఆళ్లకే ఓటేస్తే నష్టపోతారు అని ప్రజలు కెసిఆర్ ఉన్నారు. 'మేం రైతుబంధు ఎయ్యకపోయినా.. కరెంటు సక్కగ ఇయ్యకున్నా.. సాగునీటి సరఫరా సక్కగ లేకున్నా.. మోటర్లు కాలబెట్టినా.. పొలాలు ఎండబెట్టినా.. జనం మళ్లీ మనకే ఓసిండ్రని ఆరు గ్యారంటీలకు ఎగనామం పెడతారు' అని అన్నారు.దేశంలో ఎన్ని జిల్లాలు ఉంటే.. అన్ని జిల్లాలకు నవోదయ పాఠశాలలు ఇవ్వాలనేది కేంద్ర ప్రభుత్వ చట్టం. మనం పది జిల్లాలు పోయి 33 జిల్లాలు అయినవి అన్నారు. 150 ఉత్తరాలు రాసినా..పర్సనల్ గా కలిసి అడిగినా ఒక్కటంటే ఒక్కటి నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదని. ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వని బిజెపికి ఒక్క ఓటు కూడా ఎందుకు వేయాలి అన్నారు. బండి సంజయ్ ఎంపిగా ఏం చేశాడు అని ప్రశ్నించారు.

కరీంనగర్ పోరాటాల పురిటిగడ్డ..

'ఆనాడు నాకున్న పదవులన్నీ విసిరి వాళ్ల మొఖానపడేసి తెలంగాణ కచ్చితంగా నిలబడాలి.. కలబడాలి.. సొంత రాష్ట్రం కావాలి.. సొంత రాష్ట్రమైతే తప్ప దిక్కులేదని.. ఒక్కడిగా.. సైన్యంగా.. పిడికెడు మందితో జై తెలంగాణ అని బయలుదేరాం' అన్నారు. 'హైదరాబాద్‌లో చర్చోపచర్చలు. ప్రజల్లోకి వెళ్లాలి.. ప్రజాగర్జన కావాలి.బ్రహ్మాండమైన చైతన్యవంతులైన ప్రజలున్న జిల్లా కరీంనగర్ జిల్లా. ఇది పోరాటాల గడ్డ.. ఇక్కడి నుంచే ప్రారంభించాలని చెప్పి ఇదే ఎస్సార్ కళాశాల మైదానంలో.. ఇదే రాత్రి సమయంలో 2001 మే 17న 48 డిగ్రీల ఎండ అయినా తెలంగాణ ఉద్యమం కోసం ఊపిరిలూదాలని వస్తే ఆనాడు తెలంగాణ జెండాను ఆకాశమంత ఎత్తు ఎత్తిన గడ్డ ఈ గడ్డ ఈ కరీంనగర్ గడ్డనే మట్టి బొట్టు పెట్టుకొని.. పిడికిలెత్తి కార్యాచరణ చెప్పి ఉద్యమం కోసం బయలుదేరిన' అని అన్నారు. 'ఆ తర్వాత కథంతా మీకు తెలుసు...ముందుండి మీరే నన్ను నడిపించారు.

రైతుబంధు అంటే చెప్పుతో కొడతాం అంటున్నరు

'రైతుబంధు రూ.15 వేలు వేస్తాం.. కల్యాణలకి తులం బంగా రం కలిపిస్తాం అన్నారు' అని కెసిఆర్ ప్రశ్నించారు. ఇవాళ వారి నోటికి మొక్కాలి. 420 హామీలు ఇచ్చి బయలుదేరారు' అన్నారు. 'ఇవాళ ఏం మాట్లాడుతున్నారు... రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతానని ఓ మంత్రి మాట్లాడుతున్నాడు, నేను చెప్పిన బిడ్డా.. రైతులు చాలా బందబస్తుగా ఉంటాడు. వాళ్లు అదే పనికి ఎత్తుకుంటే మీ గతి అని చెప్పారు' అన్నారు. రైతుల చెప్పులు బందబస్తుగా ఉన్నాయా..? మంత్రిగా ఉన్న వ్యక్తి రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతుంటాడు' అని చెప్పారు.

# తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తాం



హైదరాబాద్: తెలంగాణలో మూడోసారి అధికారం చేపట్టిన తరువాత తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లు రద్దు, రాష్ట్రంలో కాంగ్రెస్,బిఆర్ఎస్,మజ్లిస్ పార్టీల ఏజెండా ఒక్కటేనని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా సంచలన ప్రకటన చేశారు. వ్యూహాత్మకంగా మూడు పార్టీలు కలిసే పనిచేస్తున్నాయని, వారి ప్రధాన లక్ష్యం బిజెపి, ప్రధాని మోడీని ఓడించడమేనన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో జరిగిన బిజెపి సోషల్ మీడియా వారియర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఐఎం చేతిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ కీలుబొమ్మలుగా మారాయని తెలిపారు. కుటుంబాల చేతిలో ఉన్న ఆ పార్టీలు ఎప్పటికీ ప్రజా శ్రేయస్సు కోరవని కుటుంబాల అభివృద్ధి కోసం ఎంతటి అవినీతికైనా సిద్ధపడుతున్నాయని. త్వరలో సిఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ అవినీతి జాబితా పంపిస్తానని ఆ జాబితాపై సమాధానం చెప్పిన తరువాత కమలం పార్టీపై విమర్శలు చేశారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దేశ ప్రజలంతా మరోసారి మోడీని ప్రధానిగా ఎన్నుకోబోతున్నారని, రాష్ట్రంలో మరోసారి రానున్నది బిజెపి పార్టీయేనని ధీమా వ్యక్తం చేశారు.పదేళ్లలో మోడీ సర్కార్ అవినీతిని అంతం చేసిందని, దేశం సురక్షితంగా ఉందంటే దానికి కారణం కేంద్ర ప్రభుత్వమేనని, మోడీ హాయంలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతున్నదని.కాంగ్రెస్ హయాంలో అనేక కుంభకోణాలు: కాంగ్రెస్ పాలన అంతా కుంభకోణాల మయమని, రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, మజ్లిస్ మూడు వారసత్వ పార్టీలేనని దుయ్యబట్టారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన బిజెపి బూత్ స్థాయి అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనం సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఉత్సాహం చూస్తుంటే నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి 400 ఎంపీ సీట్లను కానుకగా ఇద్దామని అంటూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడికెళ్లినా, మోదీ నామస్మరణే మార్మోగుతుందని, తెలంగాణ ప్రజలకు బిజెపికి 12 సీట్లకు తగ్గకుండా ఎంపీ సీట్లు ఉన్నాయి. కాంగ్రెస్, బిఆర్ఎస్, మజ్లిస్ ఒక్కటేనని ఈ మూడు పార్టీలు కేవలం ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తాయని, తమ వారసుల సంక్షేమం గురించి ఆలోచిస్తామని ఘాటుగా చెప్పవచ్చు. ప్రధాని మోదీ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో ఏడాదికి రూ.6 వేల చొప్పున వేస్తూ, అండగా ఉంటోందని, వచ్చే ఐదేళ్లలో దేశమంతటా, ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీరు అందజేస్తున్నారు. ఇప్పటికే 14 కోట్ల ఇళ్లకు మంచినీటి నల్లా కనెక్షన్లు ఇచ్చాం. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మజ్లిస్‌కు భయపడుతోంది. 10 సంవత్సరాల యూపీఏ పాలనలో తెలంగాణకు రూ.1.17లక్షల కోట్లు మాత్రమే వస్తే,బిజెపి పాలనలో మాత్రం ఇప్పటికే రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్లు వచ్చినట్లు తమ పార్టీ ఎప్పుడూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేయదన్నారు. సభానంతరం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని అమిత్ షా దర్శించుకుని అమ్మవారి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. పూజ కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత ఉన్నారు.అనంతరం కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ మోదీ ప్రసంగిస్తూనే దేశం ఎంతో అభివృద్ధి చెందిందని తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోడీ ప్రత్యేక నిధులు మంజూరు చేశారని తెలిపారు. కెసిఆర్ కుటుంబం తెలంగాణను దోచుకున్నదని ఆయన నియంతృత్వ పాలనతో రాష్టం అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాతబస్తీ ప్రజలు ఈసారి ఎన్నికలతో మజ్లిస్ పీడ తొలగాలని కోరుకుంటున్నారని చెప్పారు.

# కఠిన ఉపవాస దీక్షలకు విశేషం

హైదరాబాద్,నెలవంక దర్శనంతో రంజాన్ మాసం ప్రారంభమైంది. మంగళవారం నుండి నెలరోజులపాటు ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తారు. అత్యంత కఠినమైన దీక్షలతో ఉపవాసం చేయడం ఈ మాసం విశేషంగా చెప్పుకోవాలి. ఉపవాస దీక్షలో ఉన్నవారు ఎలాంటి ఆహారం తీసుకోరు. వేకువజాము నుంచి సాయంత్రి వరకు పచ్చిగంగ కూడా ముట్టరు. తరవాత ఉపవాసం విడుస్తారు.ఇలా నెలరోజులపాటు ఉపవాసదీక్ష చేయడం ముస్లిల పవిత్ర కర్తవ్యంగా భావిస్తారు. పవిత్రత అన్నది ప్రతి మతంలోనూ ఉంటుంది. ఆచార వ్యవహారాలు కూడా ఓ క్రమపద్ధతిలో మనిషిని నిలబెడుతాయి. ఇందుకు ముస్లింల ఉపావాసలు సాగించే రంజాన్ ప్రత్యక్ష ఉదాహరణ. ఓ నియమబద్ధమైన జీవితానికి ఇది తార్కారణంగా నిలుస్తుంది. ఈ నెలరోజుల కఠిన ఉపవాసంలో అనుసరించిన సన్మార్గాన్ని యేడాదంతా కొనసాగించాలని మహ్మద్ ప్రవక్త ఆదేశం. అల్లాహ్‌తో మన సంబంధాలు మరింత దృఢం చేసుకొనే అవకాశాన్ని రంజాన్ అందించింది. అల్లాహ్‌ను మన్నింపు కోరుకోవడానికీ, మనం ఎలాంటి స్థితిలో ఉన్నామో విశ్లేషించుకోవడానికీ, మన జీవిత లక్ష్యం, మన జీవిత గమ్యం గురించి ఆలోచించడానికీ, దైవాదేశాల ప్రకారం మన జీవితాల్ని చక్కదిద్దుకోవడానికీ అవసరమైన అవకాశాన్ని రంజాన్ మాసం కల్పించింది. ఆ అవకాశాన్ని మనం ఎంతవరకూ ఉపయోగించుకున్నామన్నది ఆలోచించుకోవడానికి ఈ నెల రోజులు ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా భగవంతుడి ఆదేశాలను పాటిస్తారు. రంజాన్ మాసం సందర్భంగా నెలరోజులు ప్రతి ఒక్కరూ దీనిని పవిత్ర కార్యంగా అల్లాహ్ కోసం నియమ నిబంధనలతో పాటించడం బహుశా అరుదైన విశేషమైన ప్రక్రియగా చూడాలి. ఇందులో ఆరోగ్య సూత్రాలూ ఇమిడి ఉన్నాయి. భగవంతుడిపై ప్రేమా ఉంది. కఠిన ఆచారమూ ఉంది. రోజా మనలో ఉన్న మాలిన్యాన్ని కడిగేయడానికి ప్రయత్నిస్తుంది. చెడుకు దూరం చేసి.. సత్ప్రవర్తనవైపు నడిపిస్తుంది. ఖురాన్‌లో రోజా అంటే ఉపవాసం ప్రాధాన్యాన్ని అల్లాహ్ వెల్లడించారు. దీని ప్రకారం ప్రతి ముస్లిం తప్పక ఉపవాసం పాటించాల్సిందే. పేద వారి ఆకలి ఎలా ఉంటుందో తెలియజేయడమే దీని పరమార్థం. ఉపవాస నియమాలు ఎలా ఉంటాయంటే.. వేకువజామున 4 గంటల లోపు (సహర్) భోజనాది కార్యక్రమాలు పూర్తిచేయాలి. మళ్లీ సాయంత్రం 6.30 వరకు (ఇఫ్తార్) వరకు ఎటువంటి ఆహారం, నీరు తీసుకోకూడదు. లాలాజలం కూడా మింగకూడదు. రోజూ సుమారు 14 గంటల వరకు ఈ ఉపవాస దీక్ష ఉంటుంది. సహర్ తో మొదలై ఇఫ్తార్‌తో రోజా ముగుస్తుంది. రోజాలకు సహర్, ఇఫ్తార్‌లు ప్రాణప్రదం. ముస్లింలు ఉపవాసం పాటించడానికి ముందు తెల్లవారుజామున భుజించడాన్ని సహర్ అంటారు. ఫజర్ నమాజ్‌కు ముందే లేచి తినడం వల్ల రోజంతా ఉత్సాహంగా గడపవచ్చు. దైవారాధనలు, ఖురాన్ పారాయణం చురుగ్గా చేసుకో వచ్చు. ఇదే సహర్‌లో ఉన్న శుభం. అల్లాహ్ అనుమతించిన వేళలో ఆహారం తీసుకోవడం ద్వారా.. ఉపవాసం పాటించాలన్న దైవాజ్ఞను నిర్వర్తించగలిగే శక్తి వస్తుంది. సాధారణంగా అంత తెల్లవారుజామున ఆహారం తీసుకోవాలని అనిపించదు. కానీ, సహర్ భుజించకపోతే నిస్సత్తువ ఆవహిస్తుంది. దైవారాధనలో ఏకాగ్రత సడలుతుంది. ఉపవాసం అంటే శరీరాన్ని కృశింపజేసుకోవడం కాదు. దైవంపై మనసు నిలపడం అని గ్రహించాలి. అందుకే సహర్ భుజించి సాయంత్రం వరకు దైవారాధనలో కాలం గడపాలి. బాలింతలకు, ప్రయాణంలో ఉన్నవారికి, రోగగ్రస్థులకు ఈ ఉపవాసం నుంచి మినహాయింపు ఉంటుంది. అయితే బాలింతలు, ప్రయాణంలో ఉన్నవారు ఆ తర్వాత వీటిని ఆచరించాల్సి ఉంటుంది. ఉపవాసం ఉన్న వ్యక్తి చెడుతలంపులకు దూరంగా ఉండాలి. అబద్ధాలు చెప్పకూడదు. ఘర్షణలకు దిగకూడదు. ఎవరైనా ఘర్షణకు దిగినా.. నేను ఉపవాసంలో ఉన్నానంటూ చెప్పుకుని తప్పుకోవాలి.

# రాటుదేలలేకపోతున్న కాంగ్రెస్

న్యూఢిల్లీ,వరుస పరాజయాలు,పరాభవాలు ఎదురవుతున్నా కాంగ్రెస్‌లో ఆత్మవిమర్శ కానరావడం లేదు. పటిష్టమైన నాయకత్వాన్ని నిర్మించుకోవాలన్న ఆలోచనచేయడం లేదు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసుకునే చర్యలపై దృష్టి పెట్టడం లేదు. వందిమాగధ పొగగడ్తలకు అలవాటు పడ్డ ప్రాణాలు నిజాలు గ్రహించడం లేదు. 2019 సార్వత్రక ఎన్నికలలో కాంగ్రెస్ అవమానకరమైన పరాజయం మూట గట్టుకున్న అనంతరం కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేయడం ద్వారా తానో అసమర్థ నేతగా నిరూపించుకున్నారు. పార్టీ సారథ్యాన్ని తల్లి సోనియా గాంధీ చేపట్టాక కూడా మార్పు రాలేదు. ఆమె సారథ్యం తాత్కాలికమే అని వారే చెప్పుకున్నారు. తరవాత కాంగరెస్ అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గే వచ్చారు. ఆయన కూడా ఉత్సవ విగ్రహంగా మారారు. ఈలోగా కాంగ్రెస్ వృద్ధులు అనేకులు పార్టీని వీడం ద్వారా నాయకత్వంపై ఒత్తిడి పెంచారు. ఇప్పటికీ సోనియా కుటుంబ నియంత్రణ లోనే కాంగ్రెస్ కొనసాగుతోంది. ఇది కాంగ్రెస్‌కు ఎటువంటి మేలు చేసిందని గమనిస్తే..వరుస పరాజయాలే నిదర్శనంగా చూడడాలి. 2019 తరవాత కాంగ్రెస్ బలోపేతానికి వచ్చిన అవకాశాలను చేజార్జుకుంది. కాంగ్రెస్ విధానాలు కావచ్చు..మోడీ ఎత్తులు కావచ్చు..కాంగ్రెస్ కూరుకుపోయిన బురద నుంచి బయటకు రాలేక.. స్నేహహస్తం చాచలేక చస్తోంది. వచ్చిన ప్రతి అవకాశాన్ని కాంగ్రెస్ జారవిడుచుకుంటోంది. మరి ఇప్పుడేం చేద్దామన్న ఆలోచన కూడా చేయలేకపోతోంది. ఇండియా కూటమి కూడా బలోపేతంగా లఏదు. కాంగ్రెస్ నాయకత్వంలో పనిచేయడం చాలాపార్టీలకు రుచించడం లేదు. నాయకుడిగా రాహుల్ విఫలమయ్యారు. ప్రియాంక విఫలం అయ్యింది. అయినా ఇంకా ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. పార్టీ శ్రేయస్సు కోసం, పార్టీ భవిష్యత్తు కోసం సోనియా కుటుంబం నిజాయితీగా పార్టీనాయకత్వం నుంచి నిష్క్రమించడం ద్వారా కొత్త రక్తాన్ని ఎక్కించాలి. రాష్ట్రాల్లోను, జాతీయ రాజకీయాలలోనూ కాంగ్రెస్‌ను ఒక ప్రధానశక్తిగా నిలపగల శక్తి సామర్థ్యాలు తమకు లేవని రాహుల్, ప్రియాంకలు తమకుతామే నిరూపించుకున్నారు. వరుసగా వచ్చిన ఎన్నికల్లో ఎక్కడా నాయకత్వ లక్షణాలను వీరు ప్రదర్శించలేక పోయారు. వంశపారంపర్యంగా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని నేతలుగా ఎదగలేదు. మరో ముఖ్య విషయమేమిటంటే కాంగ్రెస్ నాయకత్వం వంశపారంపర్యమన్న విమర్శలతో ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడంలో నరేంద్ర మోదీ విజయవంతమవుతున్నారు. గత కాంగ్రెస్ వైఫల్యాలపైనే చర్చలు జరిగేలా చేయడం ద్వారా మోదీ తన ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల దృష్టికి వెళ్లకుండా చేసుకుం టున్నారు. ఇందిరాగాంధీ, అత్యవసర పరిస్థితి గురించిన ప్రస్తావనలతో తిప్పి కొడుతున్నారు. చైనాకు అరుణాచల్ భూమిని కోల్పోవడం ,కర్తార్‌పూర్ సాహిబ్‌ను నెహ్రూ కారణంగానే కోల్పోయామని మోడీ అంటారు. అలాగే కాశ్మీర్ చిచ్చుకు కూడా నెహ్రూ కారణమని విమ్శలు సంధిస్తున్నారు. ఇవన్నీ కూడా నిజాలే. ఇవన్నీ కూడా ఇప్పుడు కాంగ్రెస్‌కు చుట్టుకునేలా చేస్తున్నారు. వీటిని సమర్థంగా తిప్పికొట్టగల శక్తి రాహుల్ లేదా ప్రియాంకలకు లేదు. అందుకే వారి నాయకత్వ వైఫల్యం బయటపడుతూనే ఉంది. కాంగ్రెస్‌లో బలమైన నేతలు వెళ్లిపోతున్నా ఆపలేకపోతున్నారు. ప్రభుత్వాలు కూలుతున్నా చేష్టలుడిగి చూస్తున్నారు. అన్నింటికి మించి ప్రజలతో కలసి సాగలేక పోతున్నారు. రాష్ట్రాల్లో బలమైన నేతలను నాయకులుగా ప్రోత్సహించడం లేదు. ఈ కారణంగా రాష్ట్రాల్లో కూడా బలమైన పునాదులు లేకుండా పోతున్నాయి. వారసత్వంగా నాయకత్వం లభించడం సమస్యను మరింత సంక్లిష్టం చేస్తోంది. తన తండ్రి, నానమ్మ, ముత్తాత గురించి పదేపదే ప్రస్తావించడం తప్ప మరో విషయం రాహుల్‌కు తెలియడం లేదు. దేశ రాజకీయాలపై అవగాహన లేకుండా పోయింది.

# రాజకీయాల్లో బంధుత్వానికి తావులేదు



అమరావతి,రాజకీయాల్లో యుద్ధమే తప్ప బంధుత్వం ఉండదని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. అన్యాయం జరిగితే యుద్ధం చేయడమే తనకు తెలుసునని చెప్పారు. గతంలో తాను గెలిచి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని చెప్పారు. ఎమ్మెల్యేగా ఓడిన వ్యక్తి కూటమిని ముందుకు తీసుకెళ్లడంలో కీలకంగా మారాడన్నారు. గత ఎన్నికల్లో బంధుత్వాలతో సంకెళ్లు వేశారన్నారు. ఎవరెన్ని కోట్లు పంచినా భీమవరంలో గెలుపు తమదేనని చెప్పారు. 175 సీట్లలో టీడీపీ – బీజేపీ – జనసేన పోటీ చేస్తాయన్నారు. అక్రమంగా అధికారం ఒక్కరి దగ్గర చేరితే బతకలేమన్నారు. భీమవరంలో కొమ్ములు తిరిగిన వాళ్లున్నారని.. అయినా ఒక్క జగన్‌కు భయపడుతున్నారన్నారు. పార్టీ పెట్టడానికి తాను సొంత అన్న(చిరంజీవి)ని కాదని బయటకువచ్చానని తెలిపారు. ఆయనను ఇబ్బంది పెట్టానని చెప్పారు. తాను నిర్ణయం తీసుకునే ముందు లక్ష ఆలోచిస్తానని పవన్ కళ్యాణ్ వివరించారు. జనసేన గెలిస్తే భీమవరంలో డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తామన్నారు. భీమవరంలో రౌడీయిజం కట్టడి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. గొడవలకు సై అంటే దానికి రెండింతలు సై అంటానని సవాల్ విసిరారు. వైసీపీ ఎమ్మెల్యే గంధి శ్రీనివాస్‌పై పవన్‌కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమవరంలో ఎమ్మెల్యే దౌర్జన్యాల వల్ల ఆఫీసు ఇవ్వడానికి కూడా చాలా మంది భయపడ్డారని అన్నారు. తనకే స్థలం ఇవ్వడానికి భయపడుతున్నారంటే.. అక్కడ రౌడీయిజం ఎలా ఉందో అర్థం అవుతోందన్నారు. భీమవరం కుబేర నగరం.. కానీ వైసీపీ నేతలు రౌడీ నగరంగా మార్చారని ధ్వజమెత్తారు. తన బంధువులు, కులపోళ్లు ఉన్నా.. మూర్ఖుడి మాటలే నమ్మారని చెప్పారు. భీమవరం నుంచి గంధి శ్రీనివాస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. జనసేన ఆఫీసు కోసం స్థలం చూపిస్తే సొంత డబ్బుతో కొంటానని తెలిపారు. ఏపీలో జగన్ పాలన పోవాలని.. భీమవరంలో గంధి శ్రీనివాస్‌ను ఓడించాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

# ఉద్యోగ ప్రకటనతో కోచింగ్ సెంటర్లకు డిమాండ్

హైదరాబాద్,రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో మళ్లీ కోచింగ్ సెంటర్ల వద్ద హడావిడి మొదలయ్యింది. డిఎస్సీతో పాటు, గ్రూప్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల కావడంతో వీరిలో చాలా మందికి ఉపాధి దక్కే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్‌లు వేయాలని నిరుద్యోగ యువతి, యువకులు కోరుతున్న వేళ కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డిఎస్సీ ప్రకటించింది. అలాగే గ్రూప్ పరీక్షలు చేపట్టింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువత సర్కారు కొలువుల కోసం ఇప్పటి నుంచే కుస్తీ పడుతున్నారు. గ్రంథాలయాలు నిరుద్యోగ యువతతో నిండిపోతున్నాయి. మరికొందరు కోచింగ్ సెంటర్ల బాట పడుతున్నారు. ఉపాధి కోసం వేల మంది యువత ఎదురు చూస్తోంది. గత పది సంవత్సరాలుగా ప్రభుత్వపరంగా ఎలాంటి ఉద్యోగుల భర్తీ నోటిఫికేషన్ వెలువడక పోవడంతో ఉపాధి కోసం జిల్లాల్లో వేల మంది యువతి, యువకులు ఎదురుచూస్తున్నారు. బీఈడీ, డీఎడ్ చేసిన అభ్యర్థులకు యేటా రెండు సార్లు టెట్ నిర్వహించాలి. కానీ కొన్నేళ్లుగా అది జరగడం లేదు. దీంతో ఉపాధ్యాయ వృత్తి కోర్సు చేసిన అభ్యర్థులు చాలా మంది ప్రైవేట్ పాఠశాలలో చదువులు చెప్పే అవకాశాన్ని కోల్పోయారు. పలు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రకటన చేయడంతో జిల్లాలో నిరుద్యోగులు అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలో శాఖల వారీగా ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్న పోస్టులను సైతం ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో జిల్లాలోని నిరుద్యోగ యువతలో ఆశలు చిగురి స్తున్నాయి. ఇవేకాకుండా



మరికొన్ని శాఖల్లోనూ వందల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్యా, వైద్యశాఖలతో పాటు పోలీసుశాఖలో ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఉద్యోగాల నియామకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయో పరిమితిని కూడా పెంచుతూ ప్రకటించడంతో నిరుద్యోగుల్లో మరింత ఆశలను రేకెత్తిస్తోంది. ఇవే కాకుండా మరికొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్యాశాఖలో ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారుల నివేదికలో తేలింది. మరో 21 ప్రభుత్వ శాఖల్లో వెయ్యికి పైగా ఉద్యోగ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు పేర్కొంటున్నారు.

# మారుతున్న రాజకీయ సమీకరణాలు

హైదరాబాద్,శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఆయన తనయుడు అమిత్ రెడ్డి కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది. మంగళవారం ఉదయం గుత్తా అమిత్ రెడ్డి ప్రభుత్వ సలహాదారు, సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితుడు వేం నరేందర్ రెడ్డి ఇంట్లో ప్రత్యక్షమయ్యారు. కాంగ్రెస్ టికెట్ కోసమే అమిత్ రెడ్డి భేటీ అయ్యారనే చర్చ మొదలైంది. నల్లగొండ టికెట్ ను ఇప్పటికే కాంగ్రెస్ అధినాయకత్వం జానారెడ్డి కుమారుడు కుందూరు రఘువీర్ రెడ్డికి ప్రకటిచింది. భువనగిరి స్థానాన్ని పెండింగ్ లో పెట్టింది. అమిత్ రెడ్డి భువనగిరి టికెట్ ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే వేం నరేందర్ రెడ్డిని కలిసినట్టు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ టిక్కెట్ ఇచ్చేందుకు సిద్ధమైనా వెనుకడుగు అమిత్ వేస్తున్నట్లు తెలుస్తోంది. గుత్తా అమిత్ కు నల్లగొండ లేదా భువనగిరి టిక్కెట్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ సిద్ధమైనప్పటికీ బీఆర్ఎస్ లో ఉన్న స్థానిక రాజకీయాల కారణంగా ఆయన తన కుమారుడ్ని కాంగ్రెస్‌లోకి పంపాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డితో గుత్తా వర్గయులకు సరిపడటం లేదు. టిక్కెట్ ఇచ్చినా జగదీష్ రెడ్డి వర్గం సహకరించదన్న కారణంగా వారు బయటకు రావాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అయితే భువనగిరి టిక్కెట్ ను కాంగ్రెస్ రెడ్డి వర్గానికి కేటాయిస్తుందా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. శాసనమండలి ఛైర్మన్ గా ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా పార్టీ మారితే బీఆర్ఎస్ పార్టీకి పెద్ద దెబ్బ అనుకోవచ్చు. ఎందుకంటే అసెంబ్లీలో ఓడిపోయినా.. ఇప్పటికీ తెలంగాణ శాసనమండలిలో... బీఆర్ఎస్ కే మెజార్టీ ఉంది. కీలకమైన బిల్లులు ఏమైనా మండలికి వచ్చినప్పుడు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే అవకాశం ఉంటుంది. ఇప్పుడు మండలి ఛైర్మన్ కూడా



కాంగ్రెస్ వైపు మారిపోతే ఇబ్బంది పోతుంది. గుత్తా సుఖేందర్ రెడ్డి, ఆయన కుమారుడు పార్టీ మారకుండా ఉండేందుకు కేటీఆర్ సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే గుత్తా కుటుంబీకులు స్పందించడం లేదని తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయినప్పటి నుండి గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. పెద్ద ఎత్తున నేతలు ఇతర పార్టీల్లోకి వలస పోతున్నారు. రెండు జాతీయ పార్టీలు బలంగా కనిపిస్తూండటంతో ఆ పార్టీల వైపు మొగ్గుతున్నారు. బీఆర్ఎస్ టిక్కెట్లు ఇస్తామని చెబుతున్నప్పటికీ పార్టీలు మారిపోతూండటం ఆశ్చర్యకరంగా మారింది. ఈ పరిణామాల్ని ఎలా డీల్ చేయాలో తెలియక.. బీఆర్ఎస్ నేతలు తంటాలు పడుతున్నారు.

# కారు దిగేస్తున్నారు !




హైదరాబాద్,బీఆర్ఎస‌లో కీలక నేతలు పక్క చూపులు చూస్తున్నారా? కారు దిగేందుకు సిద్ధమవుతున్నారా? గులాబీ కండువాను తీసేసి.. కాంగ్రెస్ లేదంటే బీజేపీలో చేరే దిశగా ఆలోచన చేస్తున్నారా? ప్రత్యర్థి పార్టీని పొగడటమే ఎరుగని ఓ కీలకనేత, ఆశ్చర్యకరమైన రీతిలో ఆహా.. ఓహో అని ప్రభుత్వాన్ని పొగడటం.. ఇంకొందరేమో బాహాటంగానే ప్రత్యర్థి పార్టీల నేతలతో భేటీ అవుతుండటం.. ఇలా బీఆర్ఎస‌లో మునుపెన్నడూ కనిపించని పరిణామాలను చూస్తుంటే ఆ పార్టీ ఒకింత ఇబ్బందికర, అయోమయమైన పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోందనే చెప్పొచ్చు. తాము గేట్లు ఎత్తితే బీఆర్ఎస్ ఖాళీ అవుతుందంటూ మొన్నటికి మొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటికే కొందరు కీలక నేతలు కాంగ్రెసతో టచ్‌లోకి వెళ్లి ఉంటారా? అనే ఆందోళనలు గులాబీ దళంలో వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాలు కూడా బీఆర్ఎస్ నేతలకు ‘గేట్లు తెరిచే దిశ’గానే సాగుతున్నాయి. ఇప్పటికే పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత కాంగ్రెసలో చేరారు. నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ రాములు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్ కూడా బీజేపీలో చేరారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ కూడా బీజేపీలో చేరుతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఆయన మంగళవారం కేంద్ర మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. బుధవారం ఆరూరి కాషాయ కండువాను కప్పుకొనే అవకాశమున్నట్లు సమాచారం. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిని మళ్లీ పోటీ చేయించాలని బీఆర్ఎస్ అధిష్ఠానం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆయన దానిని సున్నితంగా తిరస్కరించారు. తాను ఈసారి లోక్‌సభకు పోటీ చేయబోనని ప్రకటించారు. సిటింగ్ ఎంపీనే పార్టీ టికెట్ వద్దనడం ఏమిటి?ఎందుకు వద్దన్నారు? ఆయన బీఆర్ఎసను వీడనున్నారా? అనే ప్రశ్నలతో ఆ పార్టీ నేతలు జుత్తు పీక్కుంటున్నారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి తీరూ సందేహాలకు తావిస్తోంది. తనకు బీఆర్ఎస్ నల్లగొండ లోక్‌సభ టికెట్ ఇస్తే పోటీ చేస్తానంటూ ఇదివరకే ఆయన ప్రకటించారు. ఆయనే ఇటీవల ఆశ్చర్యంగా తాను పోటీ చేయలేనంటూ చెప్పేశారు. ఈ క్రమంలో ఆయన, సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. అమిత్, మంత్రి కోమటిరెడ్డినీ కలిశారు. పైగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం నిర్వహించిన సమావేశానికి అమిత్ గైర్హాజరయ్యారు. ఈ పరిణామాలు నల్లగొండ బీఆర్ఎస్ శిబిరంలో చర్చనీయాంశంగా మారాయి.

కొత్తగా కడియం, దానం?

బీఆర్ఎసకు చెందిన కీలక నేత, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎసను వీడి, కాంగ్రెసలో చేరే అవకాశాలున్నాయంటూ వార్తలొస్తున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎసకు కడియం ఎంతో కావాల్సిన నేత. అసెంబ్లీలో ఆ పార్టీ తరపున కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడినా... వారంతా కుటుంబ నేతలని కాంగ్రెస్, బీజేపీ విమర్శిస్తున్నాయి. ఈ విమర్శలను తిప్పికొడుతున్నట్లుగా సభలో అనుభవజ్ఞుడైన కడియం శ్రీహరిని ముందుకు తెచ్చి మాట్లాడిస్తోంది. మరి ఆయన పార్టీని వీడితే పరిస్థితి ఏమిటన్న ఆందోళన ఆ పార్టీలో ఉంది. కడియంతో ఇప్పటికే కాంగ్రెస్ నేతలు టచ్‌లోకి వచ్చారని తెలిసింది. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి ఆయన్ను పోటీ చేయించాలని కాంగ్రెస్ భావిస్తోంది. 2016లో వరంగల్ ఎంపీగా గెలిచిన శ్రీహరికి జిల్లా వ్యాప్తంగా సత్సంబంధాలుండటంతో ఆయన్ను పార్టీలోకి చేర్చుకొని, పోటీ చేయిస్తే మంచి ఫలితం ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ నుంచి కడియం గెలిస్తే.. ఆయనతో స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేయించి, ఉప ఎన్నికలో ఆయన కుమార్తె కడియం కావ్యకు టికెట్ ఇస్తామని ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. అయితే తన కుమార్తె కావ్యకే వరంగల్ లోక్‌సభ టికెట్ ఇవ్వాలంటూ కడియం ప్రతిపాదన పెట్టినట్లుగా తెలుస్తోంది. తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తీరూ అనుమానాలకు తావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి దానం కితాబిచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం రోజుకో శుభవార్త చెబుతోందంటూ మాట్లాడారు. ఆర్టీసీ ఉంటుందా? ప్రైవేటు పరం అవుతుందా? అనే ఆందోళనలో ఉన్న ఉద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వం వరాల జల్లు కురిపిస్తోందని ప్రశంసించారు. ఆర్టీసీ ఉద్యోగులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, దీన్ని గుర్తించే కాంగ్రెస్ ప్రభుత్వం వారి పక్షపాతిగా వ్యవహరిస్తోందనీ వ్యాఖ్యానించారు. మరి.. ఆయన ఈ వ్యాఖ్యలు దేనికి సంకేతం? అన్న చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిజంగానే మెచ్చుకుంటున్నారా? లేదంటే పార్టీ మారే ఆలోచనతోనే ‘పొగిడారా’? అని చర్చించుకుంటున్నారు.

## జైసల్మీర్‌లో ఘోర ప్రమాదం

జయపుర,రాజస్థాన్‌లోని జైసల్మీర్‌లో ఘోర ప్రమాదం జరిగింది. జైసల్మేర్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్ వద్ద తేజస్ యుద్ధ విమానం కుప్పకూలింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు. కల్లా కాలనీ సమీపంలో విమానం కూలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. ఇది పూర్తి స్వదేశీ పరిజ్ఞానం తో రూపొందించింది తేజస్ కుప్పకూలిపోవడం ఇదే మొదటిసారి పోఖ్రాన్గ ÷రిరగ్ రేంజ్ లో భారత్ శక్తి పేరిట సైనిక విన్యాసాలు కొనసాగుతున్న వేళ ఈ ప్రమాదం చోటుచేసుకుంది.కాగా.. గతంలోనూ ఒడిశాలో ఇలాంటి ఘటనే జరిగింది. ఢెంకనల్‌లో శిక్షణా విమానం కుప్పకూలిపోయింది. ఈ ప్రమాద ఘటనలో ఓ పైలట్ సహా శిక్షణలో ఉన్న యువతి మృతి చెందారు. విమానం గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే కుప్పకూలింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు.

# టీచర్లకు ‘నగదు’ బదిలీలు!



అమరావతి:గతేడాది జరిగిన బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందంటూ చాలామంది టీచర్లు ఆ కీలక నేత వద్దకు వెళ్లారు. న్యాయం చేయాలంటూ వినతిపత్రాలు ఇచ్చారు. అయితే మహిళా టీచర్ల వినతులను మాత్రమే పరిశీలిస్తానని అప్పట్లో ఆ నేత ఆర్భాటం చేశారు. ఉపాధ్యాయ సంఘాల నేతల ముందు అలా మాటలు చెప్పిన నేత... ఆ తర్వాత అక్రమ బదిలీలకు తలుపులు తెరిచారు. మహిళా టీచర్లైనా, పురుష టీచర్లైనా ముడుపులిస్తేనే వారి వినతులు తీసుకున్నారు. సరిగ్గా ఎన్నికల వేళ ‘నగదు బదిలీ’లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఉపాధ్యాయుల అక్రమ బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. గతేడాది బదిలీలు పూర్తికాగా ఇప్పుడు విద్యా సంవత్సరం మధ్యలో ‘సిఫారసు బదిలీలు’ పేరుతో ముడుపుల వేటకు తెరతీసింది. ఒక్కో బదిలీకి రూ.5 లక్షలకు పైగా వసూలు చేస్తూ సార్వత్రిక ఎన్నికలకు ముందు కోట్ల రూపాయల వ్యాపారం మొదలుపెట్టింది. ఇందులో ఓ కీలక నేత, కొందరు అధికారులు ఉన్నట్లు టీచర్లు చెబుతున్నారు. సుమారు 1400 మందికి నేడో, రేపో ఉత్తర్వులు జారీచేసేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. నాలుగైదు రోజుల్లో ఎన్నికల షెడ్యూలు వస్తుందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని భావిస్తోంది. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ, సచివాలయంలోని అధికారులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. గత వారంరోజుల నుంచి జరుగుతున్న ఈ కసరత్తు ఇప్పుడు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. ఎలాగూ అందరూ ఎన్నికల హడావిడిలో ఉంటారని, ఇప్పుడు బదిలీలు చేసినా రాద్ధాంతం అయ్యే అవకాశం లేదనే ఉద్దేశంతో ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు అర్థమవుతోంది.

ముడుపులన్నీ ఆ నేతకే....

అధికార పార్టీలో ఓ కీలక నేతకు ముడుపులన్నీ చేరుతున్నట్లు తెలిసింది. జగన్ ప్రభుత్వం అంటే పారదర్శకత అంటూ కబుర్లు చెప్పే ఆ నేత....ఇప్పుడు ముడుపుల బదిలీల విషయంలో మాత్రం ఎక్కడా వెనక్కి తగ్గడంలేదు. తన కార్యాలయంలో తాను చెప్పిన అధికారిని కలిసిన వారికే బదిలీలు అని తేల్చేస్తున్నారు. ఎవరైనా దరఖాస్తు చేసుకుని, ఆ అధికారిని కలవకపోతే మాత్రం ఆ వినతిపత్రాన్ని తీసి పక్కన పెడుతున్నారు. వాస్తవానికి గతేడాది టీచర్లకు సాధారణ బదిలీలు జరిగిన వెంటనే సిఫారసు బదిలీల పేరుతో కొంతమందికి కోరుకున్న చోట పోస్టింగ్‌లు ఇచ్చారు. అప్పట్లో ఉపాధ్యాయ సంఘాలు, టీచర్లు దీనిని వ్యతిరేకించినా ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా ‘ఎమ్మెల్యేలు సిఫారసు చేస్తే కొన్ని బదిలీలు చేసుకోకూడదా? ఆ మాత్రం బదిలీలు కూడా చేసుకోలేకపోతే ప్రభుత్వంలో ఉండి ఏంటి ఉపయోగం?’ అని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బహిరంగంగా వితండవాదం చేశారు. అంటే సిఫారసు బదిలీల పేరుతో అక్రమ బదిలీలు చేసుకోవచ్చని ముందుగానే ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నమాట. దీనికోసం గత నెలలో పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ నుంచి వివరాలు సేకరించారు. ఎక్కడా లిఖితపూర్వక ఆదేశాలు లేకుండా మౌఖిక ఆదేశాలతో డీఈవోల నుంచి వివరాలు తెప్పించుకున్నారు. ఇంతకాలం దానిపై వేచిచూసిన ఆ నేత, ఇప్పుడు ఎన్నికల హడావిడి ప్రారంభం కావడంతో ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశించారు.

అధికారుల ప్రమేయం

కీలక నేతతోపాటు కొందరు అధికారులు కూడా ముడుపుల వ్యవహారంలో తల దూర్చారు. కమిషనరేట్‌లోని ఓ అధికారి, సచివాలయంలోని ఓ అధికారికి బదిలీల బాధ్యతను అప్పగించగా, ‘మాకేంటి’ అంటూ వారూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు టీచర్లే చెబుతున్నారు. కీలక నేతకు ఇచ్చిన దాంట్లో 10శాతం అయినా ఇవ్వాలని ఓ అధికారి డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అంటే ఆ నేతకు రూ.5లక్షలు ఇస్తే, ఆ అధికారికి రూ.50వేలు ఇవ్వాలి. దాంతోపాటు మాకూ అంటూ సచివాలయంలోని అధికారీ ఇందులో జోక్యం చేసుకుంటున్నారని, టీచర్లు లబోదిబోమంటున్నారు.

హెచ్‌ఆర్ఏ కోసం...

వాస్తవానికి టీచర్ల బదిలీలకు గతంలో ఎప్పుడూ ఇంత పెద్దమొత్తంలో ముడుపులు సమర్పించుకోలేదు. కానీ ఎలాగైనా పట్టణ ప్రాంతాల్లోనే ఉండిపోవాలని పట్టుబట్టిన టీచర్లు ఎంతైనా ఇవ్వడానికి సిద్ధం అంటూ పోటీపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 10శాతం హెచ్‌ఆర్ఏ వస్తే, పట్టణ ప్రాంతాల్లో 16శాతం వస్తుంది. ఐదేళ్లపాటు ఈ హెచ్‌ఆర్ఏ లెక్కలు వేసుకుని మరీ ముడుపులు ఇస్తున్నారని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పట్టణాలు దాటి బయటకు వెళ్లడం ఇష్టంలేని వారు ఎంతైనా ఇస్తామంటూ పోటీపడటం వల్లే, ఇలా భారీగా ముడుపులు వసూలు చేస్తున్నారన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై దుండగుల దాడి

హైదరాబాద్, పోచారం ఐటీ కారిడార్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై గుర్తు తెలియని యువకులు దాడి చేశారు. అనురాగ్ విశ్వవిద్యాలయం సమీపంలో కారులో వెళ్తున్న టీసీఎస్ ఉద్యోగి కుర్వ నవీన్ కుమార్‌పై యూనివర్సిటీ వద్ద 8 మంది యువకులు అకారణంగా దాడి చేశారు. కొర్రెముల చౌరస్తా వరకు వెంబడించి చితకబాదారు. కారుపై రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. అనంతరం యువకులు బలవంతంగా కారును తీసుకెళ్లారు. నారపల్లి నందనవనం వద్ద కారును వదిలి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# మోడీ విశాఖ నుంచి ప్రచారం చేయరా...!?

న్యూఢిల్లీ,ఆయన దేశ ప్రధాని. ఎక్కడ నుంచి అయినా ప్రచారం చేయవచ్చు. అయిదేళ్ల క్రితం విశాఖ నుంచే నరేంద్ర మోడీ ఏపీ ప్రచారాన్ని ప్రారంభించారు. 2019 మార్చి 1న విశాఖ వచ్చిన ప్రధాని అనాడు రైల్వే జోన్ ఇచ్చేస్తున్నామంటూ ఒక జీవో కాపీని కూడా సభికులకు చూపించారు. కానీ అయిదేళ్లు గడచినా రైల్వే జోన్ ఊసే లేదు.ఇక గత మూడేళ్ళుగా చూస్తే స్టీల్ ప్లాంట్ చిచ్చు రాజేసి ఉంచారు. ప్రైవేట్ పరం చేస్తాం తప్ప తగ్గేది లేదు అని అంటున్నారు. వేయి రోజులకు పైగా కార్మికులు ఆందోళన బాటలో ఉన్నారు. అయినా సరే కేంద్రం తన నిర్ణయం మార్చుకోలేదు. పైపెచ్చు మంత్రులు అంతా కూడా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పాలసీ నిర్ణయం అంటూ వచ్చారు.దీంతో బీజేపీ మీద ఉక్కు కార్మికులకు కోపం చాలా ఎక్కువైపోతోంది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ టూర్ మీద రెండు సార్లు ప్రకటనలు వచ్చినా కూడా అది ఖరారు కాలేదు. నిజానికి చూస్తే ఈ నెల 1న ప్రధాని సభ విశాఖలో ఉండాలి. కానీ క్యాన్సిల్ అయిందని వార్తలు వచ్చారు. లేటెస్ట్ గా ఈ నెల 16న ప్రధాని సభ విశాఖలో అన్నారు.దాంతో పాటుగా విశాఖలో మోడీ రోడ్ షో చేస్తారు అని కూడా ప్రచారం సాగింది. తీరా చూస్తే ఈ నెల 17న చిలకలూరిపేటలో సభ ఉంది. అది బీజేపీ టీడీపీ జనసేన ఉమ్మడి సభగా ఉంది. దానికంటే ముందు ఈ నెల 15, 16 తేదీలలో ప్రధాని తెలంగాణా టూర్ పెట్టుకున్నారు. మరి మోడీ విశాఖ ఎపుడు వస్తారు అన్న చర్చ అయితే ఉంది.మోడీ విశాఖ సభ ఈ నెల 16 అని అనుకుంటే దాని కంటే ఒక రోజు ముందు అంటే ఈ నెల 15 కాంగ్రెస్ సభ విశాఖలో పెట్టారు. తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద భారీ సభను పెట్టారు. ఈ సభలో ఆయన స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ



మీద ప్రసంగం చేస్తూ కేంద్రం మీద నిప్పులు చెరగనున్నారు. దాంతో ఆ మరుసటి రోజే ప్రధాని సభ అంటే ఆ ప్రభావం పడుతుందని వాయిదా వేశారా అన్న చర్చ సాగుతోంది.అసలు మోడీ సభ విశాఖలో ఉంటుందా లేదా అన్నది కూడా చర్చగా ఉంది. విశాఖకు మోడీ వస్తే స్టీల్ ప్లాంట్ ఇష్యూ మీద మాట్లాడాల్సి ఉంటుందని అంటున్నారు. అలాగే రైల్వే జోన్ విషయం కూడా ప్రస్తావించాల్సి ఉంటుంది. దాంతో విశాఖ సభ ఉండే చాన్స్ లేదని అంటున్నారు. ఎన్నికల ప్రచారం కూడా మోడీ కొన్ని కీలక కేంద్రాల్లో చేపడతారని ఉత్తరాంధ్రాను ఆయన టచ్ చేయకపోవచ్చు అంటున్నారు. ఒక వేళ వచ్చినా అనకాపల్లి నుంచే మోడీ సభ ఉంటుంది తప్ప విశాఖ లో ఉండదేమో అన్న సందేహాలూ వ్యక్తం చేస్తున్నారు. విశాఖ ఎంపీ సీటు కూడా బీజేపీకి కేటాయించకపోవడం వెనక స్టీల్ ప్లాంట్ ఇష్యూ ఉండడమే అంటున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com